RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 113 | ఆదివారం, జూన్ 2, 2024 | పేజీలు : 4

## ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పరిశీలించిన రోనాల్డ్ రాస్

హైదరాబాద్: హైదరాబాద్‌లో 13 ప్రాంతాల్లో 16 హాల్స్‌లో ఓట్ల లెక్కింపు జరుగనుందని హైదరాబాద్ ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ తెలిపారు. నిజాం కాలేజీలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో రోనాల్డ్ రాస్ మాట్లాడారు. హైదరాబాద్‌లో మూడు చోట్ల పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కిస్తామని, ప్రతి కౌంటింగ్ హాల్‌లో 14 టేబుళ్లు, జూబ్లీహిల్స్ లో అత్యధికంగా 20 టేబుళ్లు ఏర్పాటు చేశామని వివరించారు. యాకుత్‌పురాలో అత్యధికంగా 24 రౌండ్లు, చార్మినార్ నియోజకవర్గంలో 15 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరుగుతుందని చెప్పారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు 17 రౌండ్లలో చేస్తామని, ప్రతి రౌండ్‌కు 30 నిమిషాల సమయం పడుతుందని, ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఐదు వివి ప్యాట్ల స్లిప్పులు లెక్కిస్తామని రోనాల్డ్ రాస్ పేర్కొన్నారు.


### అధికారంలోకి కాంగ్రెస్ వస్తుందా లేక...

# మోడీ హ్యాట్రిక్కా?




న్యూఢిల్లీ: నేడు యాక్సిస్ మై ఇండియా, టుడేస్ చాణక్య, ఐపిఎస్ఓఎస్, పోల్ స్టార్ తదితర బడా పోల్ స్టర్స్ ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను వెల్లడించనున్నారు. ఎన్నికల సంఘం ఆంక్షలు(ఎంబార్గో) సాయంత్రం 6.30 వరకే ఉండనున్నాయి. తర్వాత వివిధ మీడియా సంస్థలు ఎగ్జిట్ పోల్ వివరాలను విడుదలచేస్తాయి. లోక్ సభ ఎగ్జిట్ పోల్స్ డిబేట్స్ లో పాల్గొనకూడదని కాంగ్రెస్ నిర్ణయించుకుంది.
ఈ విషయాన్ని పవన్ ఖేరా తెలిపారు. 'టిఆర్ పి రేట్లు పెంచుకోడానికి ఎగ్జిట్ పోల్స్ నిర్వహిస్తుంటారు కనుక తమకు వాటిపై ఆసక్తి లేదు' అని ఆయన తెలిపారు. బిజెపికి సరితూలరనే కాంగ్రెస్ అలాంటి నిర్ణయం తీసుకుందని బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా తెలిపారు. ఆయన ఈ మేరకు ఎక్స్ లో పోస్ట్ పెట్టారు. కాగా కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ముమ్మరంగా ప్రచారం చేశారు. ఏది ఏమైనప్పటికీ ఎగ్జిట్ పోల్స్ ను గుడ్డిగా నమ్మడానికి లేదు. అనేక సందర్భాలలో ఎగ్జిట్ పోల్స్ విఫలమయ్యాయి.

## కన్యాకుమారిలో ముగిసిన మోడీ సుదీర్ఘ ధ్యానం



కన్యాకుమారి: తమిళనాడు లోని కన్యాకుమారిలో స్వామి వివేకానంద శిలాస్మారకం వద్ద ప్రధాన మంత్రి నరేంద్రమోడీ చేపట్టిన సుదీర్ఘధ్యానం ముగిసింది. గురువారం సాయంత్రం ప్రారంభమైన ధ్యానం, 45 గంటల పాటు కొనసాగింది. ఈ క్రమం లోనే శనివారం ఉదయం సూర్యుడికి అర్ఘ్యం వదిలారు. ధ్యానం ముగిసిన అనంతరం ప్రముఖ తమిళ కవి, తత్వవేత్త తిరువళ్లువర్ విగ్రహానికి మోడీ పూలమాల వేసి నివాళులర్పించారు. వివేకానంద శిలాస్మారకం పక్కనే చిన్న దీవిపై ఏర్పాటు చేసిన 133 అడుగుల ఎత్తయిన ఈ భారీ విగ్రహం వద్దకు ఆయన పడవలో చేరుకున్నారు. అనంతరం కన్యాకుమారి తీరానికి తిరిగి వచ్చారు. సార్వత్రిక ఎన్నికల ప్రచార గడువు ముగిసిన వెంటనే పంజాబ్ నుంచి వెనుదిరిగిన మోడీ తమిళనాడు లోని భగవతి అమ్మన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం శిలా స్మారకాన్ని చేరుకుని, ధ్యాన ప్రక్రియను ప్రారంభించారు. 131 ఏళ్ల క్రితం స్వామి వివేకానంద కూడా ఇక్కడ ధ్యానం చేశారు. 2019లో ఎన్నికల సమయంలో మోడీ కేదార్‌నాథ్ వద్ద గుహలో ధ్యానం చేసిన విషయం తెలిసిందే.

## రాష్ట్ర దశాబ్ది వేడుకలు ప్రారంభించిన బీఆర్ఎస్



హైదరాబాద్: తెలంగాణలో తొలిసారిగా ప్రతిపక్ష పార్టీగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని బీఆర్ఎస్ నిర్వహిస్తోంది. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నేటి నుంచి మూడు రోజుల పాటు రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ముగింపు వేడుకలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఈరోజు గన్ పార్క్ నుంచి అమరజ్యోతి వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. ఈ ర్యాలీలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాల్గొన్నారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రజాసంఘాలు, బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొని ర్యాలీని ముందుకు తీసుకెళ్తున్నారు. తొలుత అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులు అర్పించి కేసీఆర్ ర్యాలీని ప్రారంభించారు.

## గవర్నర్‌ను కలిసిన సిఎం, డిప్యూటీ సిఎం



హైదరాబాద్: జూన్ 2న రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా జరుపనున్నారు. ఈ సందర్భంగా రాజ్‌భవన్‌లో శనివారం ఉదయం గవర్నర్ సిపి రాధాకృష్ణన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కలిశారు. రాష్ట్ర ఆవిర్భావ సందర్భంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో ఆదివారం ఉదయం జాతీయ జెండా ఆవిష్కరణ, ఇతర కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ఈ వేడుకులకు కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ హాజరుకానున్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రేపు సాయంతరం ట్యాంక్‌బండ్‌పై తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా ఘనంగా జరుపుతారు. వివిధ జిల్లాలకు చెందిన కళాబృందాలతో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తారు.



## సోనియా గాంధీ తెలంగాణ పర్యటన రద్దు

న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు కాంగ్రెస్ మాజీ చీఫ్, యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీ హాజరు కావడంలేదు. అనారోగ్య కారణాలతో తెలంగాణ టూర్ ను సోనియా గాంధీ రద్దు చేసుకున్నారు. ఈ వేడుకలకు ప్రత్యేక అతిథిగా హాజరు కావాలంటూ తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఢిల్లీకి వెళ్లి సోనియా గాంధీని ఆహ్వానించారు. సిఎం రేవంత్ రెడ్డి ఆహ్వానాన్ని మన్నించిన సోనియా గాంధీ... వేడుకలకు హాజరవుతానని మాటిచ్చారు. షెడ్యూల్ ప్రకారం ఆదివారం ఉదయం సోనియా గాంధీ హైదరాబాద్ చేరుకోవాల్సి ఉంది. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న సోనియా ఈ టూర్ విషయంలో తన వ్యక్తిగత వైద్యుడి సలహా కోరారు.

### ఓట్ల లెక్కింపు కోసం వ్యూహాన్ని చర్చించేందుకు...

# ఇండియా బ్లాక్ సమావేశం

న్యూఢిల్లీ: జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు కోసం టిఎంసి, పిడిపి సమావేశానికి గైర్హాజరైనప్పటికీ తమ వ్యూహంపై చర్చించేందుకు 'భారత కూటమి' సీనియర్ నేతలు శనివారం ఇక్కడ సమావేశమయ్యారు.
కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీ, సిపిఐ-ఎం, సిపిఐ, డిఎంకు, జెఎంఎం, ఆప్, ఆర్జేడీ, శివసేన (యూబీటీ), ఎన్సీపి (శరద్ పవార్) సీనియర్ నేతలు శనివారం మధ్యాహ్నం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నివాసంలో సమావేశమై చర్చలు జరిపారు. రాష్ట్రంలో ఎన్నికలు ఉన్నందున తాము సమావేశానికి హాజరు కాబోమని టిఎంసి అధినేత్రి , పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఇదివరకే చెప్పగా, వ్యక్తిగత కారణాల వల్ల పిడిపి అధినేత్రి మెహబూబా ముఫ్తీ సమావేశానికి హాజరుకాలేదు. "మా అమ్మ కంటికి శస్త్రచికిత్స చేయించుకున్నందున నేను వెళ్లడంలేదు" అని ఆమె పిటిఐ వార్తా సంస్థకి తెలిపారు.



## వర్షాకాలం అప్రమత్తంగా ఉండండి..

### విద్యుత్ శాఖకు డిప్యూటీ సీఎం ఆదేశం

హైదరాబాద్: కొద్దిరోజుల్లో వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో యావత్ విద్యుత్తు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. శనివారం సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాల నేపథ్యంలో ఈదురు గాలుల మూలంగా చెట్లు విరిగిపడడం, స్తంభాలు కూలిపోవడం, విద్యుత్ తీగలు ఊడిపడడం వంటి సంఘటనలు సాధారణంగా జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎవరికి ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా వెనువెంటనే స్పందించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. రాష్ట్ర ప్రజలు, పరిశ్రమలకు అవసరమైన విద్యుత్తు అందుబాటులో ఉంది, సరఫరా లోను ఎటువంటి అంతరాయం తలెత్తకుండ చర్యలు చేపట్టాలని అన్నారు. లైన్స్ క్లియరెన్స్ విషయంలోనూ జాగ్రత్త వహించాలని సూచించారు. ఒకేసారి పలు ప్రాంతాల్లో ఎల్‌సీ ఇవ్వడానికి వీలు లేదు, ఒక ప్రాంతం తర్వాత మరో ప్రాంతంలో ఎల్‌సీ ఇవ్వాలని సూచించారు.





## బండి సంజయ్ సంచలనాత్మక వ్యాఖ్యలు

హైదరాబాద్: బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సంచలనాత్మక వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత బిఆర్ఎస్ పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేస్తారని వ్యాఖ్యానించారు. మాజీ సిఎం కెసిఆర్ ఓ ఒప్పందం చేసుకున్నారని అన్నారు. ఈ ఒప్పందంలో భాగంగా కెసిఆర్ పదేళ్ల పాలన అవినీతిపై దర్యాప్తును కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగనీయడం లేదన్నారు. తెలంగాణ దశాబ్ది వేడుకలకు కెసిఆర్ ను ఆహ్వానించిన కాంగ్రెస్ ఎందుకని బిజెపి నేతలను ఆహ్వానించలేదని ఈ సందర్భంగా ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర అధికారిక లోగోలో చార్మినార్ ఉండొద్దన్నది తమ పార్టీ విధానమని, ఇప్పుడు కూడా దానికే తాము కట్టుబడి ఉన్నామని బండి సంజయ్ అన్నారు. కెసిఆర్ తన పదేళ్ల పాలనలో తెలంగాణను అప్పుల కుప్పగా మార్చారని ఆరోపించారు. ఇదిలావుండగా మరో మూడు రోజుల్లో లోక్ సభ ఎన్నికల ఫలితాలు విడుదల కానున్న వేళ.. కాంగ్రెస్ పార్టీలో బిఆర్ఎస్ విలీనం అంటూ చేసిన వ్యాఖ్యలపై ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశం అయింది.

## సంపాదకీయం

# అసమాన ప్రతిభాశాలి ఎంఎస్ఆర్....!

"శ్రీ హనుమాన్ గురుదేవులు నా యెద పలికిన సీతా రామ కథ....నే పలికెద సీతా రామ కథ"... ఎమ్మెస్ రామారావు సుమధుర కంఠం నుండి జాలువారిన సుందరాకాండ వినని తెలుగు వారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. హనుమాన్ జయంతి, శ్రీ రామ నవమి నేపథ్యంలో, హనుమాన్ మండల దీక్షలు, రామ నవరాత్రుల సందర్భంగా ఎక్కడ విన్నా సుందరా కాండ వినిపించడం సర్వసాధారణమే. అంతేకాక, ఆంజనే య, రామాలయాలలో నిరంతరం మైకుల ద్వారా రామారావు గానం చేసిన సుందరాకాండ ప్రతిధ్వనించ డం కద్దు. మోపర్తి సీతారామారావు అంటే ఎవరో చాలామందికి వెంటనే స్ఫురించక పోవచ్చును. కాని ఎం.ఎస్.రామారావు అనగానే తెలుగు సినిమాల తొలి నేపథ్య గాయకునిగా సంగీతాభిమానులకు, పాత తరం సినీ ప్రేక్షకులకూ ఆయన గుర్తుంటారు. సుందరదాసు' అనగానే ఆయన యావత్ తెలుగు ప్రజలందరికీ సుపరిచితులు, సుప్రసిద్ధులు. ఆయన రచించి, సంగీతం సమకూర్చి గానం చేసిన 'సుందరకాండ' గీతాలు యావదాం ధ్ర దేశంలోనూ మారు మ్రోగాయి. మారు మ్రోగుతున్నాయి. ఇంకా మారు మ్రోగుతూనే ఉంటాయి. రామాయణంలోని మధురమైన 'సుందరకాండ' కథను, తేట తెలుగులో, మృదు మధురమైన శైలిలో ఆయన పాడిన తీరు అసమానం, అపూర్వం, అద్వితీ యం. ఇలా మూడు విధాలుగా స్వీయ రచన గావించి, సంగీతం సమకూర్చి, స్వయంగా గానం చేసిన అసమాన ప్రతిభాశాలి ఎమ్మెస్ రామారావుకు ముందు మరొక లేరనడం అతిశయోక్తి కాదు. ఆయనకు "సుందర దాసు" అనే బిరుదు ఉంది. గేయ రూపంలో రచించి గానం చేసిన రామయణ భాగం సుందరకాండము "ఎమ్మెస్ రామారావు సుందరకాండ" గా సుప్రసిద్ధం. తులసీదాసు రచించిన హనుమాన్ చాలీసాను తెలుగులోకి అనువదించి ఆకాశవాణిలో పాడారు. ఆ రెండూ ఆయనకు మంచి గుర్తింపును, ఖ్యాతిని తెచ్చిపెట్టాయి.ఎమ్మెస్ రామారావు (మోపర్తి సీతారామారావు) 1921 మార్చి 7 న గుంటూరు జిల్లా అమృతలూరు మండలానికి చెందిన మోపర్రు గ్రామలో జన్మించారు. ఈయన తల్లిదండ్రులు మోపర్తి రంగయ్య, మంగమ్మ గార్లు సీతారామ భక్తులు. చిన్నతనం నుండే రామారావు గారు పాటలు పాడుతుండేవారు. ఈయన విద్యాభ్యాసము నిడుబ్రోలు ఉన్నత పాఠశాలలో, గుంటూరు హిందూ కళాశాలలో జరిగింది. ఇంటర్మీడియేట్ రెండవ సంవత్సరం చదువుతున్న రోజుల్లో (1941 లో) అంతర్ కళాశాలల లలిత సంగీత పోటీలో మొదటి బహుమతి గెలుచు కున్నారు. న్యాయనిర్ణేతల్లో ఒకరైన అడవి బాపిరాజు చలన చిత్ర రంగంలో ప్రవేశించమని ఆయనను చాలా ప్రోత్సహించారు. 1944 లో ప్రఖ్యాత సినీ దర్శక నిర్మాత వై.వి.రావు తన తహసీల్దార్ చిత్రంలో ఎమ్మెస్ చేత మొదటి సారిగా "ఈ రేయి నన్నొల్ల నేరవా రాజా" అనే ఎంకి పాట పాడించా రు. ఆ చిత్రంలో కథా నాయకుని పాత్ర పోషించిన సి.హెచ్. నారాయణరావుకు పాడారు. తెలుగు చలన చిత్ర చరిత్రలో ఇది మొట్ట మొదటి నేపథ్య గానం. అలా తెలుగు చలనచిత్ర చరిత్రలో మొట్టమొదటి నేపథ్య గాయకులుగా గుర్తింపు పొందారు. తరువాత ఎమ్మెస్ దీక్ష, ద్రోహి, మొదటిరాత్రి, పాండురంగ మహత్యం, నా యిల్లు, సీతారామ కల్యాణము, శ్రీరామాంజనేయ యుద్ధము మొదలైన సినిమాలలో పాడారు. 1944 నుంచి 64 వరకు తెలుగు చలన చిత్రాలలో నేపథ్య గాయకునిగా మద్రాసులో నివసించి న ఆయన 5 సంవత్సరాల పాటు కర్ణాటక శాస్త్రీయ సంగీతం నేర్చు కున్నారు. కొన్ని పాటలు రాసి నల్లపిల్ల, తాజ్ మహల్, హంపి, కనీసం, హిమాలయాలకు రాలేనయ్యా, మొదలైన గ్రామఫోన్ రికార్డులు ఇచ్చారు. నీరాజనం చిత్రంలో "ఈ విశాల ప్రశాంత ఏకాంత సౌధములో నిదురించు జహాపనా" పాటలో ఎమ్మెస్ గొంతు వినిపించింది. 1963 సంవత్సరాంతంలో మద్రాసు వదిలి వెళ్లి, రాజమండ్రి చేరుకుని 1974వరకు అక్కడే నివసించారు. అక్కడ నవభారతి గురుకులంలో పది సంవత్సరాలు ఉద్యోగం చేసారు. 1970 లో పెద్ద కుమారుడు బాబూరావు భారతీయ వాయుసేన ఇండియన్ ఏర్ ఫోర్స్ లో పైలట్ ఆఫీసరుగా నియమితుడైనారు. 1971లో పాకిస్థానుతో జరిగిన యుద్ధ కాలంలో అతని ఆచూకీ తెలియ లేదు. తల్లి తండ్రులిద్దరూ భయం చెంది కుమారుని క్షేమం కోసం వాయు కుమారుడైన హనుమంతుని ఆరాధించడం మొదలు పెట్టారు. తర్వాత కొంత కాలానికి అబ్బాయి క్షేమంగా ఇల్లు చేరడంతో శ్రీ హనుమానుడే వారి ఇష్ట దైవమైనాడు. ఆయన హనుమాన్ చాలీసా, సుందరకాండ వ్రాయడానికి అదే ప్రేరణ. 1972 నుండి 74 వరకు తులసీదాసు హనుమాన్ చాలీసాను హిందీ నుంచి తెలుగులోనికి అనువ దించారు, తన పేరుతో అవినాభావ సంబంధమేర్పడ్డ సుందరకాండ గేయ రచన చేశాడు. 1975 నుంచి హైదరాబాదులోని చిక్కడపల్లిలో నివసించారు. రామారావుకు 1977 సంవత్స రంలో సుందరదాసు అనే బిరుదాన్ని ఇచ్చారు. ఈయన ఏప్రిల్ 20, 1992న హైదరాబా దులో తుది శ్వాస విడిచారు.

## ఉప్పరపల్లి లో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు





**షామీర్పేట (గరుడ వార్త) :** తుంకుంట మున్సిపాలిటీ ఉప్పరపల్లి గ్రామంలో పంచముఖి హనుమాన్ దేవస్థానం సన్నిధిలో హనుమాన్ జయంతి వేడుకలు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగాయి ఆంజనేయ స్వామి వారికి అభిషేకముచంధనపుజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అన్న ప్రసాదా కార్యక్రమాలు నిర్వహించారు హనుమాన్ భక్త మండలి మాట్లాడుతూ స్వామి వారి కృపాకటాక్షాలతో అందరూ సుభిక్షంగా ఉండాలని, ప్రతి సంవత్సరం హనుమాన్ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు


## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మేడ్చల్ జిల్లా జట్టు ఎంపికయింది



**శామీర్ పేట, (గరుడ వార్త) :** స్పోర్ట్స్ స్కూల్ లో రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా అథ్లెటిక్స్ జట్టును శనివారం ఎంపిక చేశారు. శామీర్ పేట మండలం తూముకుంట పరిధిలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్లో మేడ్చల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్ 8, 10, 12, 14, 16, 18, 20 బాల బాలికలకు అథ్లెటిక్స్ సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించినట్లు మేడ్చల్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కూరపాటి రాజశేఖర్ తెలిపారు. ఈ పోటీలను తెలంగాణ క్రీడా పాఠశాల స్పోర్ట్స్ ఆఫీసర్ రతన్ బోస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజశేఖర మాట్లాడుతూ క్రీడాకారులు ఉత్తమ విద్య తో పాటు శారీరక వ్యాయామంతో ముందుకు సాగాలన్నారు. ఈ నెల 6, 7 తేదీలలో వరంగల్లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికలు నిర్వహించినట్లు ఆయన చెప్పారు. విద్యార్థులు విద్యా, క్రీడ, సాంస్కృతిక కార్యక్రమాలలో ముందుంటూ ప్రతిభ కలిగిన శిక్షణలో ఎదిగి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మేడ్చల్ జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. ఈ పోటీలలో లాంగ్ జంప్, రన్నింగ్ వంటి పలు ఈవెంట్లను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్, వాలంటరీలు దయాల్, శేఖర్, సురేందర్, వరలక్ష్మి, పలక్ గులేరియా, తదితరులు పాల్గొన్నారు.

### మరో రూ.2వేల కోట్ల రుణ సేకరణ..

## ఆర్బీఐ షెడ్యూల్ జారీ




**హైదరాబాద్:** కొత్తగా అప్పులకు ఆర్బీఐ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ బాండ్ల వేలంలో తెలంగాణ ప్రభుత్వం పాల్గొననున్నది. ఈ నెల 4న రాష్ట్ర ప్రభుత్వం రుణాల ద్వారా మరో రూ.2000 సమీకరించుకోనుంది. ఈ మేరకు ఆర్థికశాఖ రిజర్వ్ బ్యాంకు ద్వారా బాండ్లు జారీ చేసింది. రూ.1000 కోట్ల విలువైన బాండ్లను 16 ఏళ్ల కాలానికి, మరో రూ.1000 విలువైన బాండ్లను 19 సంవత్సరాల కాలానికి జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన బాండ్లను ఆర్బీఐ 4న వేలం వేయనుంది. వేలంలో బాండ్ల విక్రయం తర్వాత రూ.2000 మొత్తం రాష్ట్ర ఖజానాకు చేరుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024–25లో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు రూ.8000 కోట్లను అప్పుగా తీసుకొంది. తాజాగా రూ.2000 కోట్లతో ఆ మొత్తం రూ. 10వేల కోట్లకు చేరనుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం గత పదేళ్లలో సుమారు రూ.7 లక్షల కోట్లు అప్పులు చేసింది. వాటికి చెల్లించే వడ్డీలు, కిస్తీలే తడిసిమోపెడయ్యాయి. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పా-టైన తర్వాత ఇప్పటి వరకు అంటే.. డిసెంబరు నుంచి ఈ నెల 13 వరకు రూ.17,618 కోట్ల రుణాలు (బడ్జెట్, బడ్జెటేతర) చేసింది. అయితే.. ఇదే వ్యవధిలో రూ.25,911 కోట్ల మేర (అప్పులు, వడ్డీలు) కిస్తీల పేరిట తిరిగి చెల్లించింది. కొత్తగా చేసిన అప్పుల కంటే సుమారు రూ.8 వేల కోట్లకు పైగా చెల్లింపులను ఎక్కువగా చేశారు. ఆ మేరకు రాష్ట్ర ప్రజలపై రుణ భారం తగ్గినట్లయిందని అంచనా వేస్తున్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కలిపి తిరిగి చెల్లించేందుకు గడిచిన 125 రోజుల్లో రేవంత్ సర్కారు సగటున రోజుకు రూ.207 కోట్లు ఖర్చు పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతర్వాత సంక్షేమ నిధులను భారీగా వ్యయం చేస్తోంది. ఈ క్రమంలో ఆర్థిక శాఖపై భారం పడుతోంది. మొత్తంగా డిసెంబర్ 2023నుంచి ఏప్రిల్ 2024 నాటికి రూ.66,507 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలకు రూ.22328కోట్లు, వడ్డీలు, అప్పుల రీ పేమెంట్లకు రూ.26,374కోట్లు, రైతు భరోసా రూ.5575కోట్లు, చేయూత రూ. 3840కోట్లు, మహాలక్ష్మి(ఆర్టీసీ) పథకానికి రూ.1125కోట్లు, గృహజ్యోతికి రూ.200కోట్లు, రాజీవ్ ఆరోగ్య శ్రీ రూ.189కోట్లు, ఎల్పీజీ సబ్సిడీ(మహాలక్ష్మి) రూ.80కోట్లు, విద్యుత్ సబ్సిడీ చెల్లింపు రూ.3924కోట్లు, బియ్యం సబ్సిడీ రూ.1147కోట్లు, రైతు బీమా రూ.734కోట్లు, డైట్ చార్జీలు రూ.418కోట్లు, మధ్యాహ్న భోజనం పథకానికి రూ.52కోట్లు, అంగన్వాడీ వేతనాలు రూ.69కోట్లు, హోంగార్డుల వేతనాలు రూ.186కోట్లు, డ్వాక్రా మహిళలకు రూ.267కోట్లు చెల్లింపులు చేసింది.

## పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో జాగ్రత్తలు తప్పనిసరి

### - మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతం





**జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) :** జూన్,4 వ తేదీన మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పకడ్బందీగా, జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా రిటర్నింగ్ అధికారి గౌతమ్ సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పై ఏ ఆర్ ఓ, కౌంటింగ్ సూపర్ వైజర్ ,కౌంటింగ్ అసిస్టెంట్స్, లకు శిక్షణా కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరి నియోజకవర్గ పరిధి లో ఏడు సెగ్మెంట్ల ల లో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కు 20 టేబుల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఓట్ల లెక్కింపు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈవియం ఓట్ల లెక్కింపు కంటే ముందు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రారంభించాలన్నారు. ఉదయం 8 గంటల నుండి పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రక్రియ కొనసాగించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ కవర్ ఓపెన్ చేసి, డిక్లరేషన్,వాలిడిటీ, ఇన్ వాలిడ్ ఓట్ల ను వేరు చేసి జాగ్రత్తగా ధృవీకరించుకొని బండల్స్ చేసి లెక్కింపు కు సిద్ధంగా ఉంచాలన్నారు.కౌంటింగ్ కేంద్రంలో ఎక్కడ కూడా పొరపాటు లేకుండా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్పనిసరిగా అనుసరించాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ఎలాంటి జాప్యం లేకుండా సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ శ్యామ్ ప్రకాష్,జిల్లా శిక్షణా నోడల్ అధికారి కేశు రామ్,డిస్ట్రిక్ట్ లెవెల్ మాస్టర్స్ ట్రైనర్ తిరుమలేశ, గోపాల్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విత్తన కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు మెరుగైన అవగాహన

**శామీర్ పేట, (గరుడ వార్త):** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు విత్తనాలు కొనుగోలుపై అవసరమైన అవగాహన కల్పించారు. శని వారం శామీర్ పేట మండలం తుర్కపల్లి గ్రామం రైతులకు ఎలాంటి విత్తనాలు కొనుగోలు చేయాలో వ్యవసాయ అధికారి వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వ్యవసాయ శాఖ నుంచి లైసెన్స్ పొందిన డీలర్స్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. లూజుగా ఉన్న సంచుల్లోంచి విత్తనాలు కొనకూడదని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. విత్తనాలు కొనుగోలు చేసిన రసీదులను, విత్తనాల ప్యాకెట్ ను పంటకాలం పూర్తి అయ్యేవరకు జాగ్రత్తపరచాలని తెలిపారు. గడువు మీరిన విత్తనాలు కొనకూడదని చెప్పారు. విత్తనాలు కొనే ముందు రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. శామీర్ పేట సహకార సంఘంలో వరి ధాన్యం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బి పి టి5204 సన్న రకం, కే ఎన్ ఎం1638, కేఎన్ఎం118 సన్న రకాలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి రవి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## ఊరూరా ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



**శామీర్ పేట, (గరుడ వార్త) :** పూర్వ ఉమ్మడి శామీర్ పేట మండలంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలను జరుపుకున్నారు. శనివారం ఉమ్మడి షామీర్ పేట మండలం లోని వివిధ గ్రామాలలో హనుమాన్ జయంతి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు చందనాభిషేకము అర్చనలు నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. దేవరయంజాల్ లోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా ఎంపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉప్పరి పల్లిలో పంచముఖ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేపట్టారు. తూముకుంట లో హనుమాన్ దీక్ష భక్తులు ఇరుముడులు కట్టుకొని కొండగట్టుకు బయలుదేరారు. లక్ష్మాపూర్ పంచముఖి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు వెళ్లి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

గరుడ వార్త


## సీడ్స్ దుకాణాలపై టాస్క్ ఫోర్స్ అధికారుల దాడులు




అయిజ పట్టణంలోని సీడ్స్ దుకాణాలపై టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. వానాకాలం ప్రారంభం కావడంతో రైతులు పత్తి మిరప కంది ఆముదం వంటి విత్తనాలను పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో సీడ్స్ దుకాణాల్లో బ్రాండెడ్ విత్తనాలను అమ్మకాలు చేయాలని టాస్క్ ఫోర్స్ అధికారులు దుకాణాల యజమానులను ఆదేశిస్తున్నారు. రైతులకు నకిలీ విత్తనాలను అంటగడితే కఠిన చర్యలు తీసుకుంటామని అలంపూర్ తాలూకా టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు నాగేశ్వరరావు హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు ఒరిజినల్ రసీదులు తప్పనిసరిగా అందజేయాలని యజమానులకు సూచించారు. కార్యక్రమంలో ఏవో శంకర్ లాల్, హెడ్ కానిస్టేబుల్ అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ వైద్యులపై దాడులు




**సికింద్రాబాద్:** సికింద్రాబాద్ లో నకిలీ వైద్యులపై వైద్య మండలి మరొక్క సారి కొరడా జులిపించివది. శుక్రవారం రాత్రి వైద్య మండలి సభ్యురాలు డా. ప్రతిభ లక్ష్మి ఆద్వర్యంలో ఆకస్మిక తనిఖీలు జరిపారు. అడ్డగుట్ట, తుకారాంగేట్, వెస్ట్ మారేడ్ పల్లిలో ఆకస్మిక తనిఖీలు. 10మంది నకిలీ వైద్యుల గుర్తించారు. ఒక్కో నకిలీ వైద్యుడు 20, 25, 30 ఏళ్లుగా వైద్యం అందిస్తున్న వైనం బయటపడింది. జిల్లా వైద్యాధికారికి నివేదిక పంపుతాం., త్వరలోనే చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు

## పశువుల కొవ్వుతో నూనె తయారీ అదుపులోకి తీసుకున్న పోలీసులు



**జోగులాంబ:** జోగులాంబ గద్వాల జిల్లా ఐజ పట్టణంలో పశువుల కొవ్వు నుండి నగలి నూనె తయారు, చేస్తూ స్థానికంగానే కాకుండా పక్కన ఉన్న కర్ణాటక రాష్ట్రం లోని రైచూర్ పట్టణానికి, ఆంధ్రప్రదేశ్ లోని కర్నూల్ కు డబ్బాలలో ప్యాక్ చేసి తరలిస్తున్న ముఠా గుట్టు రట్టు చేసిన పోలీసులు.. ఐజ పట్టణంలోని ఒక పశువుల కొట్టం పట్టణ పోలీసులు దాడి చేసి కొంతమంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

## డ్రైవర్ అప్రమత్తతో తప్పిన పెను ప్రమాదం

**గన్నవరం:** గన్నవరం గాంధీబొమ్మ సెంటర్ ఎపియస్ ఆర్టీసీ బస్సు లో ఉన్న ప్రయాణికులకు ప్రమాదం తప్పింది. కాకినాడ డిపోకి చెందిన ఇంద్ర బస్సు నుండి పొగలు వ్యాపించాయి. డ్రైవర్ అప్రమత్తతో బస్సుని పక్కకు ఆపివేసాడు.విజయవాడ నుండి సుమారు 40 మంది ప్రయాణికులతో కాకినాడ కు బస్సు బయలుదేరింది. డీజిల్ లీకు కావడం వల్ల పొగలు వ్యాపించియని సమాచారం...

# హెలెన్ కెల్లర్ జీవితం ఆదర్శప్రాయం



అమెరికాకు చెందిన హెలెన్ కెల్లర్ ప్రఖ్యాత రచయిత, అంగవైకల్య హక్కుల పరిరక్షకురాలు, న్యాయవాది, రాజకీయ కార్యకర్త, పౌర హక్కుల పరిరక్షకురాలు, శ్రామికవర్గ పక్షపాతి, ఉపన్యాసకురాలుగా తనదైన బహుముఖీయ ప్రజ్ఞాశాలి. చిరుప్రాయంలోనే బ్రేయిన్ ఫివర్ కారణంగా కంటి చూపును కోల్పోయి, చెవిటితనం ఉన్నప్పటికీ ఆత్మవిశ్వాసంతో తన జీవితాన్ని అందరికీ ఆదర్శప్రాయంగా కొనసాగించారు. లక్ష్య సాధనకు అంగవైకల్యం అడ్డుకాదని, తను చీకట్లో నిలిచి ప్రపంచానికి దీపస్తంభంగా మార్గనిర్ధేశనం చేసిన హెలెన్ కెల్లర్ ప్రతిభ అద్వితీయం, అనన్యసామాన్యం, అనుసరణీయం. 27 జూన్ 1880న అమెరికా అలబామాలో కేట్ ఆడమ్స్, కల్నల్ ఆర్థర్ కెల్లర్ దంపతులకు జన్మించిన హెలెన్ కెల్లర్ రెండవ ఏటనే కంటి చూపును, వినికిడిని కోల్పోయారు. తన 7వ ఏట గురువు అన్నే సుల్లివన్ సహాయంతో చదవడం, వ్రాయడం నేర్చుకోవడం ప్రారంభించారు. వినికిడి సమస్యల పట్ల కృషి చేస్తున్న గ్రాహం బెల్, టెలిఫోన్ అవిష్కర్తను కలిసి సూచనలు, సలహాలు పొందారు. 1894లో 'రైట్-హుమాసన్', 'హొరేస్ మన్' బధిరుల పాఠశాలలో విద్యాభ్యాసం ప్రారంభించారు. 1896లో 'కేంబ్రిడ్జ్ స్కూల్ ఫర్ లేడీస్'లో చేరి విద్యార్జన కొనసాగించారు. 1904లో తన 24వ ఏట హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పొందిన ప్రథమ చెవిటి, కంటి చూపు లేని మహిళగా రికార్డు సాధించారు. తన గురువు అన్నా సుల్లివన్‌ను 1905లో వివాహమాడిన హెలెన్ 1924 - 68 కాలంలో 'అమెరికన్ ఫౌండేషన్ ఫర్ ది బ్లైండ్' వేదికగా అమెరికాతో పాటు 35 దేశాలు పర్యటించి అంధుల సమస్యల పట్ల బహుళ ప్రచారాలు నిర్వహించారు. ప్రముఖ అమెరికన్ రచయిత్రిగా 14 పుస్తకాలు, వందల కొద్ది ఉపన్యాసాలు, 500లకు పైగా వ్యాసాలు రచించిన హెలెన్ కెల్లర్ జంతుజాలం నుంచి మహాత్మాగాంధీ వరకు అనేక అంశాలను లోతుగా స్పృశించారు. దివ్యాంగుల పక్షపాతిగా కెల్లర్ జీవితాంతం అవిశ్రాంతంగా శ్రమిస్తూనే కార్మిక హక్కులు, మహిళా వికాసం, ప్రపంచ శాంతి విషయాల్లో ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేశారు. 'అమెరికన్ సివిల్ లిబర్టీస్'లో సభ్యత్వం తీసుకొని అవిశ్రాంతంగా శ్రమించారు. 1909లో అమెరికా సోషలిస్ట్ పార్టీలో చేరారు. 1903లో తన 22వ ఏటనే ఆత్మకథ 'ది స్టోరీ ఆఫ్ మై లైఫ్' అను పేరుతో రచించి ప్రపంచ దృష్టిని ఆకర్షించగలిగారు. దీనితో పాటుగా 'ఆప్టిమిజమ్', 'ది వరల్డ్ ఐ లివ్ ఇన్', 'మై రిలిజియన్', 'హెలెన్ కెల్లర్స్ జర్నల్', 'ది ఓపెన్ డోర్' లాంటి పలు పుస్తకాలు రచించారు. 27 జూన్ రోజున అమెరికా 'హెలెన్ కెల్లర్ డే'గా పాటించుట జరుగుతున్నది. 1971లో 'అలబామా ఉమెన్ హాల్ ఆఫ్ ఫేమ్'గా ఖ్యాతిని గడించారు. 1964లో నాటి అమెరికా అధ్యక్షుడు లిండన్ బి జాన్సన్ చేతుల మీదుగా 'ప్రెసిడెన్సియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్' అత్యుత్తమ పౌర పురస్కారం పొందారు. కెల్లర్ 87వ ఏట 01 జూన్ 1968న తుది శ్వాస విడిచారు. అతి చిరుప్రాయంలోనే వినికిడి, కంటి చూపు కోల్పోయిన హెలెన్ కెల్లర్ నిరాశ చెందకుండా ప్రజలతో కమ్యునికేట్ చేసుకోగలగడం, చేతి వేళ్ళతో సైగల భాష నేర్చుకోవడం, ఇతరుల పెదవుల కదలికలను (టచ్-లిప్ రీడింగ్) చేతులతో స్పృశిస్తూ అర్థం చేసుకోగలగడం, టైప్ చేయగలగడం, ఫింగర్-స్పెల్లింగ్, బ్రెయిలీ లిపి లోతులు తెలుసుకోగలగడం లాంటి విలక్షణతలతో బంధిరులకు, అంధులకు ఆత్మవిశ్వాసం నింపగలిగారు. చెవిటితనం, అంధత్వంతో బాధ పడే దివ్యాంగల చికిత్స నిమిత్తం %వి% 2 మిలియన్ల నిధులను 'అమెరికన్ ఫౌండేషన్ ఫర్ ది బ్లైండ్' సంస్థకు హెలెన్ కెల్లర్ సేకరించగలిగారు. జీవిత చరిత్రను 'ది మిరకిల్ వర్కర్' పేరున చలన చిత్రంగా తీయగా, దానికి 'పులిట్జర్ ప్రైజ్'తో పాటు రెండు అకాడమీ ఆవార్డులు కూడా రావడం జరిగింది. 30 జూన్ 1925న అంతర్జాతీయ లయన్స్ సంస్థ సమావేశంలో మాట్లాడుతూ అంధత్వంతో చీకట్లో మగ్గుతున్న అభాగ్యుల పాలిట చూపును ప్రసాదించే సేవకులుగా అంధత్వ నివారణకు (నైట్స్ ఆఫ్ బ్లైండ్) కృషి చేయాలని లయన్స్ స్వచ్ఛంధ సేవాకార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ పిలుపును సేవా మంత్రంగా భావించిన లయన్స్ అంతర్జాతీయ సంస్థ తమ కార్యాచరణలో అంధత్వ నివారణకు పెద్ద పీట వేస్తూ 'సైట్ ఫస్ట్' పేరుతో నేటికి అంధత్వ నివారణకు అవిరళ కృషి చేయడం జరుగుతున్నది. కెల్లర్ ప్రతిభను గుర్తించిన అమెరికన్ అధ్యక్షులు 'గ్రోవర్ క్లీవ్లాండ్' నుంచి 'లిన్డన్ జాన్సన్' వరకు అందరూ తమ నివాసం 'వైట్ హౌజ్'కు ప్రత్యేకంగా ఆహ్వానించడం విశేషం. అమెరికన్ ప్రథమ 'గుడ్‌విల్ అంబాసిడర్ టు జపాన్'గా నియమింపబడిన హెలెన్ కెల్లర్ జీవితం దివ్యాంగులకే కాకుండా సాధారణ ప్రపంచ మానవాళికి కూడా ఆదర్శంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. 'సూర్యకిరణాలను చూసే వారికి తమ నీడ కనిపించదు' అనే నినాదంతో తన జీవిత లక్ష్యాలను ఛేదించుటలో వైకల్యం అడ్డురాలేదని రుజువు చేసిన హెలెన్ కెల్లర్ ప్రతిభ అసామాన్యం, తన మానవీయ కోణం అనుసరణీయం.

## నిషేధంతో పొగాకును అరికట్టగలమా...?



ఆరోగ్యానికి హానికరంగా మారిన గుట్కాపై నిషేధాన్ని మరో ఏడాది పాటు పొడిగిస్తూ ఇటీవల తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. దీంతో గుట్కా తయారీ, క్రయవిక్రయాలను నిషేధిస్తూ ఫుడ్ సేఫ్టీ విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. గుట్కా, పాన్ మసాలాల్లో ఆరోగ్యానికి హాని కలిగించే పొగాకు, నికోటిన్ ఉండడం మూలంగానే వాటిని నిషేధించినట్లు పేర్కొంది. 2025 మే 24 వరకు గుట్కాను తయారు చేసినా, నిల్వ ఉంచినా, విక్రయాలు జరిపినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. అయితే తెలంగాణతోపాటు మరికొన్ని రాష్ట్రాలు గుట్కా విక్రయాలపై ఇలాంటి నిర్ణయమే తీసుకున్నా.. ఇప్పటికీ క్రయవిక్రయాలు జరుగుతూనే ఉన్నాయి. నిబంధనలు సరిగా అమలు చేయలేకపోవడం, కోర్టు కేసుల కారణంగా అడ్డంకులు వస్తున్నట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా గుట్కా, పొగాకు విక్రయాలను నిషేధిస్తూ పార్లమెంటులో చట్టం చేస్తేనే సత్ఫలితాలు వచ్చే అవకాశముంది. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2011 ప్రకారం పొగాకు ఉత్పత్తులపై 2012 నుంచి పలు రాష్ట్రాలు వాటిని నిషేధించడం మొదలుపెట్టాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఏపీ ప్రభుత్వం 2013 జనవరి 9న గుట్కా ఉత్పత్తులను నిషేధించింది. ఏటా నిషేధం కొనసాగించేలా గెజిట్ జారీ చేసింది. అయితే గుట్కాను మాత్రమే నిషేధించడంతో పొగాకుతో తయారయ్యే పాన్‌మసాలా ఉత్పత్తులు మార్కెట్‌లో బాగా పెరిగాయి. దీంతో 2014 జనవరి 9న సమగ్రంగా ఆదేశాలు ఇచ్చింది. అందుకే నికోటిన్, పొగాకు అనవాళ్లు ఉండి నోటి ద్వారా తీసుకునే అన్ని ఉత్పత్తులపైనా నిషేధం విధించింది.

పొగాకు ఉత్పత్తుల వినియోగంపై 2014లో భారత్ చట్టం చేసింది. దీని తర్వాత సిగరెట్ పెట్టెపై 'పొగతాగడం ఆరోగ్యానికి హానికరం' అనే పదాలు రాయాలని సూచించింది. ఈ నిర్ణయంపై సిగరెట్ తయారీదారులు సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ.. కోర్టు కేంద్రం నిర్ణయాన్ని సమర్థించింది. అంతేకాకుండా పొగతాగే అలవాటును మాన్పించడాన్ని అనేక రకాలైన ఆంక్షలను అమల్లోకి తెచ్చింది. గుట్కాను నిషేధించడం, బహిరంగ ప్రదేశాలలో సిగరెట్లు తాగనివ్వకపోవడం, పొగాకు ఉత్పత్తుల ప్రచారాలపై నిషేధం, పద్దెనిమిదేళ్ల లోపు పిల్లలకు పొగాకు ఉత్పత్తులను విక్రయించకుండా ఉండడం, పాఠశాలలు, కళాశాలల సమీపంలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలను నిషేధించారు.

## బాలలందరికీ విద్య ఉత్తమాటేనా?




నిరక్షరాస్యత నిర్మూలనే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా- దేశంలో బాలలందరికీ విద్య గగన కుసుమమే అవుతోంది. సార్వత్రిక విద్యా వ్యాప్తికి ప్రభుత్వాలు పలు పథకాలు చేపట్టినా ఇంకా అధిక శాతం పిల్లలు విద్యాగంధం లేక బాలకార్మికులు గానే ఉండి పోతున్నారు. బాలల శ్రేయస్సుకు కృషి జరుగుతున్నా ఆచరణలో ఫలితాలు కానరావడం లేదు. పాఠశాల సౌకర్యాలు లేక కొందరు, అవి ఉన్నా వివిధ కారణాల రీత్యా బడికి వెళ్లలేక మరికొందరు బాలలు తమ ఉజ్వల భవిష్య త్తును అంధకార మయం చేసుకుంటున్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలతో ముడివడి సంక్షేమ పథకాలకు నోచుకోక, చదువు చెప్పించే స్థోమత లేక ఎందరో పేద తల్లిదండ్రులు గత్యంతరం లేని స్థితిలో చిన్నారులపై భారాన్ని మోపుతున్నారు. హొటళ్లు, కిరాణా దుకాణాలు, ఫ్యాక్టరీలు, మిల్లులు, క్వారీలు, గనులకు తమ పిల్లలను పనికి పంపు తున్నారు. వ్యవసాయ పను లకు కొందరు బాలలు వెళుతున్నారు. చివరికి కొందరు పిల్లలను భిక్షాటన వృత్తిలోకి బలవంతంగా నెడుతున్నారు. వివిధ రంగాలలో బాలకార్మికులు అవస్థలు పడుతూ అనుక్షణం శ్రమిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పెద్దలు చేయాల్సిన పనులను సైతం వీరే చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు నీళ్లు వదిలి బాలల చేత వెట్టిచాకిరీ చేయించు కుంటున్నా, వారికి విముక్తి కలిగించాలన్న ధ్యాస సంబంధిత అధికారుల్లో లేకపోవడం బాధాకరం. యజమానులు చెప్పిందే చట్టంగా, వారు చేసేదే సంక్షేమంగా పరిస్థితులున్నా కార్మికశాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అప్పుడప్పుడు తూతూ మంత్రంగా దాడులు చేస్తున్నా దోషులకు ఎలాంటి శిక్షలు పడడం లేదు. 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ - ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని భారత రాజ్యాంగం లోని 24వ నిబంధన స్పష్టం చేస్తున్నా అది కాగితాలకే పరిమితమవడం శోచనీయం. పేదరికం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పసి పిల్లల బంగారు కలలు చెదిరి పోతున్నాయి. పాలబుగ్గల లేత వయసులో వారు కార్మికులుగా మారడం బాధాకరం. కార్మిక చట్టాలకు విరుద్ధంగా పిల్లల చేత పని చేయించు కునే యాజమాన్యాలు తగిన వేతనాలు ఇవ్వడం లేదు. పిల్లలు పనిచేసే చోట తగిన రీతిలో భద్రతా సౌకర్యాలను కల్పించక పోవడం ఆక్షేపణీయం. ప్రాథమిక హక్కులను పేర్కొన్న రాజాంగంలోని 3వ ప్రకరణంలోని 15(8)వ అంశం బాలల కోసం ప్రత్యేక శాసనాలు చేసే అధికారం ప్రభుత్వానికి కలుగజేస్తున్నది. 28వ అధికరణం ప్రకారం బాలలను వ్యాపార వస్తువుగా మార్చడం, నిర్బంధ సేవలను చేయించు కోవడం అపరా ధంగానే పరిగణించాలి. 14 సంవత్సరాల లోపు పిల్లలను కర్మాగారాలలో, గనులలో, ఇతర ప్రమాదకరమైన పనులలో నియమించడాన్ని 24వ ఆర్టికల్ నిషేధించింది. 39(ఇ) ప్రకారం బాలలను వారి వయసుకు తగని, శక్తికి మించిన పనులలో నియమించ రాదు. పేదరికాన్ని సాకుగా చేసుకుని బాలలను పనుల్లో నియ మించడం నిషేధించాలని రాజ్యాంగం ఆదేశిం చింది. కఠిన చట్టాలు ఎన్ని ఉన్నా చాలామంది పిల్లలు బాల కార్మికులు గానే మిగిలి పోతున్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న నిర్బంధ ప్రాథమిక విద్య ఈనాటికీ ఫలించని కలగానే మిగిలి పోతున్నది.

# విలక్షణ రాజకీయ దురంధరుడు.....!


నీలం సంజీవరెడ్డి విలక్షణ నాయకులు. భారత దివంగత రాష్ట్రపతి సంజీవరెడ్డి రాజకీయ జీవితం అనేక ఒడిదుడుకులతో కూడుకున్నది. విజయాలు, అపజయాలు, త్యాగాలు, సాహసోపేత నిర్ణయాలు, రాజకీయపు ఎత్తుగడలతో కూడిన రాజకీయ జీవితం ఆయనది. 1940 ల నుండి 1970ల వరకు మూడు దశాబ్దాల రాష్ట్ర, దేశ రాజకీయాలను ప్రభావితం చేసిన ప్రతి ముఖ్య సంఘటనతోను ఆయనకు ప్రత్యేక, ప్రత్యక్ష, సంబంధాలు, ప్రమేయాలు ఉన్నాయి. భారత రాష్ట్రపతిగా ఏకగ్రీవంగా ఎన్నికైన అరుదైన రికార్డు రాష్ట్రపతి సంజీవరెడ్డికే దక్కింది. లోక సభాపతిగా ఎన్నిక కాగానే, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన మొదటి లోక్‌సభ సభాపతి, సంజీవరెడ్డి కావడం విశేషం. పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి అధికారపక్ష - ప్రతిపక్షం మధ్య సమన్వయ సాధనకు కృషి చేసి, స్పీకర్ పదవికే వన్నె తెచ్చిన ఆదర్శ నేత నీలం. లోక్‌సభ సభాపతిగా రెండు సార్లు ఎన్నికై, రెండుసార్లూ రాష్ట్రపతిగా పోటీ చేసేందుకై రాజీనామా చేసిన చరిత్ర ఆయనకు ఉంది. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు, ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటు, ఆ తరువాతి రాజకీయ చరిత్రలతో సంజీవరెడ్డి పాత్ర విస్మరించ రానిది. నీలం సంజీవరెడ్డి (మే 19, 1913 - జూన్ 1, 1996) భారత రాష్ట్రపతి గా, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా, లోక్‌సభ సభాపతిగా, ఆంధ్ర రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, సంయుక్త మద్రాసు రాష్ట్రంలో మంత్రిగా, అఖిల భారత కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడిగా వివిధ పదవులను అలంకరించి, ప్రజల మన్ననలను పొందిన సుదీర్ఘ రాజకీయ అనుభవ శాలి సంజీవ రెడ్డి. అనంతపురం జిల్లా, ఇల్లూరు గ్రామంలో 1913, మే 18 న రైతుబిడ్డగా సంజీవరెడ్డి జన్మించారు. మద్రాసు దివ్యజ్ఞాన సమాజం పాఠశాల లోను, అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోను చదువుకున్నారు. 1929 లోనే మహాత్మా గాంధీ స్ఫూర్తితో చదువును పక్కనపెట్టి రాజకీయాల్లో చేరి స్వాతంత్ర్య పోరాటం వైపు దృష్టి సారించారు. 1937లో ఆంధ్ర ప్రాంతీయ కాంగ్రెసు కమిటీకి కార్యదర్శిగా ఎన్నికై దాదాపు పదేళ్ళపాటు ఆ పదవిలో కొనసాగారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళారు. 1940, 1945 ల మధ్య ఎక్కువకాలం అతను జైలులో ఉన్నారు. 1946లో మద్రాసు శాసనసభకు, తర్వాత 1947లో రాజ్యాంగ నిర్మాణ సంఘమైన రాజ్యాంగ సభకు ఎన్నికయ్యారు. 1949 నుండి 1951 వరకు మద్రాసు రాష్ట్ర మంత్రివర్గంలో మంత్రిగా పనిచేసారు. 1951 లో ఆంధ్ర ప్రాంత కాంగ్రెసు పార్టీ అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు మంత్రిపదవికి రాజీనామా చేసారు. 1951లో ఆంధ్ర ప్రాంత కాంగ్రెసు అధ్యక్ష పదవికి ఎన్.జి.రంగాతో పోటీ పడ్డారు. ప్రకాశం పంతులు మద్దతు ఉన్నా, రంగాను ఆ ఎన్నికలలో ఓడించారు. ఫలితంగా ఆచార్య రంగా, ప్రకాశం కాంగ్రెసును వదిలి వెళ్ళారు. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినపుడు సంయుక్త మద్రాసు రాష్ట్ర శాసనసభ సభ్యుల నుండి కొత్త రాష్ట్ర కాంగ్రెసు శాసనసభా పక్ష నాయకుణ్ణి ఎన్నుకునే సమయంలో సంజీవరెడ్డి పోటీలేకుండా ఎన్నికయ్యారు. ముఖ్యమంత్రి పదవి తథ్యమైనా, అప్పటి రాజకీయాల ఫలితంగా తాను తప్పుకుని టంగుటూరి ప్రకాశం పంతులుకు నాయకత్వం అప్పగించి, ఉప ముఖ్యమంత్రి అయ్యారు. మళ్ళీ 1955లో రాజకీయాల ఫలితంగానే ముఖ్యమంత్రి అయ్యే అవకాశాన్ని వదులుకున్నారు. అప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చెయ్యడానికి ఎన్.జి.రంగా నాయకత్వం లోని కృషికార్ లోక్ పార్టీ మద్దతు కాంగ్రెసుకు అవసరమైంది. అయితే బెజవాడ గోపాలరెడ్డి ముఖ్యమంత్రి అయితేనే తాము మద్దతు ఇస్తామని రంగా ప్రకటించడంతో తాను తప్పుకుని మళ్ళీ ఉప ముఖ్యమంత్రి అయ్యారు. ఆంధ్ర ప్రదేశ్ అవతరణలో సంజీవరెడ్డిది ప్రముఖపాత్ర. రాష్ట్ర స్థాపనలో ప్రధాన, నిర్ణాయక ఘట్టమైన పెద్దమనుషుల ఒప్పందంలో ఆంధ్ర తరపున అప్పటి ఆంధ్ర ముఖ్యమంత్రి, బెజవాడ గోపాలరెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సంజీవరెడ్డి కూడా పాల్గొని ఒప్పందంపై సంతకం చేశారు. ఆంధ్ర ప్రదేశ్ అవతరించాక, కాంగ్రెసు శాసనసభాపక్ష నాయకుడిగా బెజవాడ గోపాలరెడ్డిని ఓడించి, తాను ముఖ్యమంత్రి అయ్యారు. అల్లూరి సత్యనారాయణ రాజును రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్ష పదవి పోటికి నిలబెట్టి, రంగాను ఓడించారు. 1960లో అఖిల భారత కాంగ్రెసు అధ్యక్ష పదవికి తాను ఎన్నికవడంతో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసారు. అలా కాంగ్రెసు అధ్యక్షుడిగా రెండేళ్ళు పనిచేసి, మళ్ళీ 1962లో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యారు. రవాణా సంస్థల జాతీయీకరణ వివాదంలో సుప్రీం కోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పు పట్టడంతో 1964 ఫిబ్రవరి 29 న పదవికి రాజీనామా చేసారు. తర్వాత కేంద్ర రాజకీయాలలో క్రియాశీలక పాత్ర పోషించారు. 1964 జూన్ 9 న లాల్ బహదూర్ శాస్త్రి ప్రభుత్వంలో ఉక్కు, గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. తర్వాత రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1967లో ఇందిరా గాంధీ ప్రభుత్వంలో కూడా కొద్దికాలం మంత్రిగా చేసారు. 1967లో నాలుగవ లోక్‌సభకు హిందూపురం నియోజక వర్గం నుండి ఎన్నికై, లోక్‌సభకు సభాపతిగా కూడా ఎన్నికయ్యారు. సభాపతి నిష్పాక్షికంగా ఉండాలనే ఉద్దేశంతో ఎన్నిక కాగానే, కాంగ్రెసు సభ్యత్వానికి రాజీనామా చేసాడు. కాంగ్రెస్ పార్లమెంటరీ బోర్డు 1969 జూలై 10న బెంగళూరులో సమావేశం అయి, పార్టీ అధ్యక్షుడు నిజలింగప్ప, ప్రధాని ఇందిర సహా పార్టీలోని పెద్దలు కె. కామరాజ్, మొరార్జీ దేశాయి తదితరుల చర్చల అనంతరం 1969 జూలై 19 న సభాపతి పదవికి రాజీనామా చేసి, రాష్ట్రపతి పదవికి ఇందిరా గాంధీకి ఇష్టం లేకున్నా, కాంగ్రెస్ సీనియర్ నేతల నిర్ణయం మేరకు, ఇందిర నామినేషన్ దాఖలు లు వెంట రాగా, పోటీ చేసారు. "అంతరాత్మ ప్రబోధం" అనే ఇందిర నినాదంతో, కాంగ్రెసు అంతర్గత రాజకీయాల ఫలితంగా మరో తెలుగు వారు - వి.వి.గిరి - చేతిలో కొద్ది తేడాతో ఓడి పోయారు.

# విద్వేష ప్రసంగాలతో ప్రధాని హోదాను దిగజార్చారు



న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ వ్యవహరించిన తీరును మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ తీవ్రంగా విమర్శించారు. విద్వేష ప్రసంగాలు, అనుచితమైన వ్యాఖ్యలతో ప్రధానమంత్రి తన హోదాను దిగజార్చారని పేర్కొన్నారు. తనపైనా తప్పుడు ఆరోపణలు చేశారన్నారు. తాను ప్రధానిగా వున్న సమయంలో ఏనాడూ ఏ ఒక్క కమ్యూనిటీని వేరుగా చూడలేదని స్పష్టం చేశారు. లోక్‌సభ తుది దశ పోలింగ్ సందర్భంగా పంజాబ్ ఓటర్లను ఉద్దేశించి ఆయన ఒక లేఖ రాశారు. ప్రస్తుతం భారతదేశం కీలకమైన దశలో వుందన్నారు. భారతదేశంలో నియంతృత్వ పాలనను ప్రారంభించడానికి నిరంకుశ ప్రభుత్వం పదేపదే చేస్తున్న దాడుల నుండి ప్రజాస్వామ్యాన్ని, మన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి ఇదే చివరి అవకాశమని అన్నారు. గత పదేళ్లుగా, పంజాబ్‌ను, పంజాబీలను, పంజాబ్‌తత్వాన్ని దూషించడంలో బిజెపి ప్రభుత్వం ఒక్క అవకాశాన్ని కూడా వదులుకోలేదన్నారు. ముస్లింలకే మొదటి హక్కు వుంటుందని తాను వ్యాఖ్యలు చేసినట్టు తన ప్రసంగానికి తప్పుగా భాష్యం చెప్పారంటూ మోడీని విమర్శించారు. ఈ ఎన్నికల సందర్భంగా సాగిన రాజకీయా ప్రచారాన్ని నిశితంగా పరిశీలించానని, ప్రధాని మోడీ తన హోదాకు తగిన రీతిలో కాకుండా అత్యంత విషపూరితమైన విద్వేష ప్రసంగాలకు పాల్పడారు. ఆయన ప్రసంగాలన్నీ విభజనరీతిలోనే సాగాయి. ఈ పదవి స్థాయిని తగ్గించిన తొలి ప్రధాని ఆయనేనని అన్నారు. ప్రతిపక్షాలను ఉద్దేశించో లేదా సమాజంలోని ఏదొక వర్గాన్ని లక్ష్యంగా చేసుకునో మోడీ తన ప్రచారాన్ని సాగించారని మన్మోహన్ విమర్శించారు. తనపైన కూడా కొన్ని అబద్ధపు ప్రకటనలు చేశారన్నారు. దేశ ప్రజలు ఇవన్నీ చూస్తునే వున్నారన్నారు. మోడీ ప్రభుత్వం అనుసరించిన వ్యవసాయ, ఆర్థిక విధానాలను తీవ్రంగా విమర్శించారు. 750మందికి పైగా రైతులు ముఖ్యంగా పంజాబ్‌కి చెందినవారు నెలల తరబడి ఢిల్లీ సరిహద్దుల్లో వేచిచూసి అమరులయ్యారని గుర్తు చేశారు. లాఠీలు, రబ్బర్ బుల్లెట్లు చాలవన్నట్లు స్వయాన ప్రధానే మన రైతులను 'ఆందోళనజీవులు' పరాన్నజీవులు అంటూ పార్లమెంట్ వేదికగా వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. తమను సంప్రదించకుండా తమపై రుద్దిన మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరించాలన్నదే వారి ఏకైక డిమాండ్ అని అన్నారు.

# గాజాకు మరింత మానవతా సాయం



బీజింగ్ : స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటుకు అందరూ మద్దతు ఇవ్వాలని చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. గాజా ప్రజలకు మరింత మానవతా సాయం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. గురువారం బీజింగ్‌లో అరబ్ దేశాల నేతలతో జరిగిన సదస్సును ఆయన ప్రారంభించారు. గత అక్టోబరు నుండి ఇజ్రాయిల్ సాగిస్తున్న దురాక్రమణపూరిత దాడులను మరింత ఉధృతం చేసిందని, ప్రజలు అంతులేని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జిన్‌పింగ్ పేర్కొన్నారు. చైనా-అరబ్ దేశాల సహకార వేదిక సమావేశాలను ఆయన ప్రారంభిస్తూ, "యుద్ధం నిరంతరంగా కొనసాగరాదు" అని వ్యాఖ్యానించారు. ఈ యుద్ధం సమస్యను పరిష్కరించేందుకు అంతర్జాతీయ శాంతి సదస్సు నిర్వహించాలని ఆయన కోరారు. గాజాకు 6.9కోట్ల డాలర్ల మానవతా సాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ యుద్ధ బాధితులకు సాయం అందిస్తున్న ఐక్యరాజ్య సమితి సంస్థకు 30లక్షల డాలర్లను విరాళంగా ఇస్తామన్నారు. పాలస్తీనాకు చైనా, అరబ్ దేశాలు మద్దతునిస్తున్నాయి. ఆక్రమిత భూభాగాల్లో ఇజ్రాయిల్ సెటిల్‌మెంట్లను ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఇప్పటికి ఏడు మాసాలకు పైగా సాగుతున్న ఈ యుద్ధంలో 36వేల మందికి పైగా మరణించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్ ఫత్తా అల్ సిసి మాట్లాడుతూ, గాజాలో కాల్పుల విరమణకు మద్దతిస్తూ, స్వతంత్ర పాలస్తీనా దేశం ఏర్పడాలని కోరుతున్న చైనాను ప్రశంసించారు. అత్యంత దారుణంగా సాగుతున్న ఈ యుద్ధాన్ని ఆపేందుకు అంతర్జాతీయ సమాజం నైతిక, చట్టపరమైన బాధ్యతలు తీసుకోవాలని కోరారు. ఇజ్రాయిల్ దిగ్బంధనాన్ని విచ్ఛిన్నం చేసి, పాలస్తీనియన్లను వారి భూభాగాల నుండి బలవంతంగా తరిమేస్తున్న ఇజ్రాయిల్ దాష్టీకాలను ఆపాలని, ఇందుకోసం తక్షణమే నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని కోరారు.


# 8 గంటలు ఆగిన విమానం ప్రయాణీకుల అగచాట్లు




న్యూఢిల్లీ : ఢిల్లీ నుంచి అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం 8 గంటలు ఆలస్యమైంది. ప్రయాణికులు ఎక్కిన తర్వాత విమానం ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి ఎంతకూ కదలకపోవడంతో క్యాబిన్ లోపల వారంతా తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. తర్వాత కొద్ది సేపటికి విమానం నుంచి ప్రయాణికులను దిగాల్సిందిగా సిబ్బంది కోరారు. విమానం నుంచి దిగిన వారంతా ఎయిర్ పోర్టులోనే పడిగాపులు కాయాల్సి వచ్చింది. కొందరు ప్రయాణికులైతే అలసిపోయారు. విమానంలో ఎయిర్‌కండీషన్ కూడా పనిచేయకపోవడంతో తమ పరిస్థితి మరీ దయనీయంగా మారిందని ప్రయాణికుల్లోని ఓ జర్నలిస్టు ఎక్స్(ట్విటర్)లో పోస్టు చేశారు. ఈ పోస్టును విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు ట్యాగ్ చేశారు. ఎయిర్‌ఇండియా ప్రైవేటైజేషన్ పూర్తగా ఫెయిలైందనడానికి ఇది నిదర్శనమని ఫైర్ అయ్యారు. ఈ పోస్టుకు స్పందించిన ఎయిర్‌ఇండియా సంస్థ తమ విమానం ఆలస్యమవడంపై విచారం వ్యక్తం చేసింది. ఇటీవలే ముంబై నుంచి శాన్‌ఫ్రాన్సిస్కో వెళ్లాల్సిన ఎయిర్‌ఇండియా విమానం కూడా ఆరు గంటలు ఆలస్యమైంది. ఈ విమానంలో కూడా ఏసీ లేకుండా ప్రయాణికులు ఆరు గంటల పాటు ఇబ్బందులు పడుతూ కూర్చోవాల్సివచ్చింది.

# 'గాంధీ పరువు' తీసిన మోడీపై ఫిర్యాదు...

**న్యూఢిల్లీ :** మహాత్మా గాంధీపై చేసిన వ్యాఖ్యలపై ప్రధాని నరేంద్ర మోడీపై సినీ దర్శకుడు లూయిట్ కుమార్ బర్మన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గౌహతిలోని హాతీ గా పోలీస్ స్టేషన్‌లో ఈ ఫిర్యాదు నమోదు చేశారు. మోడీ వ్యాఖ్యలు గాంధీని దూషించేలా, పరువు తీసేలా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సినిమా ద్వారానే మహాత్మాగాంధీ ప్రపంచానికి తెలిసిందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. ఈ వ్యాఖ్యలు పెద్ద ఎత్తున విమర్శలకు దారి తీశాయి. ఏబీపీ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మోడీ ఈ విషయాన్ని వెల్లడించారు.




# దక్షిణాఫ్రికా ఎన్నికలు ఆధిక్యంలో ఎఎన్‌సి




**జొహానెస్‌బర్గ్ :** దక్షిణాఫ్రికా ప్రొవిన్షియల్, సార్వత్రిక ఎన్నికల్లో అధికార ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఎఎన్‌సి) ఆధిక్యంలో ఉంది. బుధవారం పోలింగ్ ముగిసిన వెంటనే అంటే అర్ధ రాత్రి నుంచి కౌంటింగ్ మొదలైంది. 5.5 శాతం పోలింగ్ కేంద్రాల్లో బ్యాలెట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి ఎఎన్‌సి 43.2 శాతం ఓట్లతో అధిక్యంలో ఉన్నట్లు జాతీయ ఎన్నికల సంఘం (ఐఇసి) తెలిపింది. తుది ఫలితాలు వెల్లడి కావడానికి మరో రెండు మూడు రోజులు పట్టవచ్చు. ప్రధాన ప్రతిపక్షమైన డెమొక్రటిక్ అలయెన్స్ రెండో స్థానంలోను, ఎకనమిక్ ఫ్రీడమ్ ఫైటర్స్ (ఇఎఫ్‌ఎఫ్) మూడవ స్థానంలోను, మాజీ అధ్యక్షుడు జాకోబ్ జుమా ఎఎన్‌సి నుంచి బయటకొచ్చి సొంతంగా ఏర్పాటు చేసిన ఎంకె పార్టీ నాల్గవ స్థానంలోను నిలిచాయి. 2019 ఎన్నికల్లో కన్నా అధికంగా ఈ సారి ఓట్లు పోలయ్యాయని ఎన్నికల సంఘం తెలిపింది. గతసారి 66 శాతం ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 2.7 కోట్ల మంది ఓటర్లు నమోదు కాగా, వీరిలో 66 శాతానికిపైగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు పెద్దయెత్తున బారులు తీరడం, ఓటింగ్ యంత్రాల మొరాయింపు వల్ల కొన్ని చోట్ల రాత్రి బాగా పొద్దుపోయేవరకు పోలింగ్ కొనసాగింది. ప్రాథమిక ఫలితాలు ఎంకె పార్టీని తీవ్ర నిరాశకు గురిచేశాయి. ప్రధాన ప్రతిపక్షమైన డెమొక్రటిక్ అలయెన్స్ రెండో స్థానంలోను, ఎకనమిక్ ఫ్రీడమ్ ఫైటర్స్ (ఇఎఫ్‌ఎఫ్) మూడవ స్థానంలోను, మాజీ అధ్యక్షుడు జాకోబ్ జుమా ఎఎన్‌సి నుంచి బయటకొచ్చి సొంతంగా ఏర్పాటు చేసిన ఎంకె పార్టీ నాల్గవ స్థానంలోను నిలిచాయి.

# సార్వత్రిక ఎన్నికలకు ముందే బ్రిటన్ పార్లమెంట్ రద్దు....!



**బ్రిటన్ :** బ్రిటన్‌లో త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. జులై 4న ముందస్తు ఎన్నికలకు వెళ్లనున్నట్లు ఆ దేశ ప్రధాన మంత్రి రిషి సునాక్ ఇటీవలే ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఎన్నికలకు ముందు బ్రిటన్ పార్లమెంట్ రద్దైంది. ఎన్నికల షెడ్యూల్‌కు అనుగుణంగా పార్లమెంట్‌ను గురువారం రద్దు చేశారు. ఇక బ్రిటన్ పార్లమెంట్‌లో మొత్తం 650 మంది సభ్యులు ఉన్న విషయం తెలిసిందే. పార్లమెంట్ రద్దుతో ఐదు వారాల ఎన్నికల ప్రచారం నేటి నుంచి అధికారికంగా ప్రారంభమైంది. జులై 4న బ్రిటన్‌లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. గత 14 ఏళ్లుగా బ్రిటన్‌లో కన్జర్వేటివ్ పార్టీ అధికారంలో ఉంది. రెండేళ్ల క్రితం ఆ దేశ ప్రధానిగా భారత సంతతికి చెందిన రిషి సునాక్ బాధ్యతలు చేపట్టి చరిత్ర సఅష్టించారు. అయితే, ప్రధానిగా సునాక్ తీసుకున్న నిర్ణయాలపై సొంత పార్టీ నేతల నుంచే విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు జరగబోయే ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. ఈ ఎన్నికల్లో అధికార కన్జర్వేటివ్ పార్టీకి ఓటమి ఖాయమంటూ అత్యధిక ఒపీనియన్ పోల్స్ అంచనా వేస్తున్నాయి. ఈ ఎన్నికల్లో విపక్ష లేబర్ పార్టీ మెరుగైన ఫలితాలు సాధిస్తుందని అంచనాలు వెలువడుతున్నాయి. ఈనెల 23న ప్రధాని అధికారిక నివాసం '10 డౌనింగ్ స్ట్రీట్' వద్ద వర్షంలో తడుస్తూనే సునాక్ ఎన్నికల తేదీలపై ప్రకటన చేశారు. 'బ్రిటన్ ప్రజలు తమ భవిష్యత్తు ఎలా ఉండాలో ఎంచుకునే సమయం వచ్చింది. ఆర్థిక మంత్రిగా, ప్రధానమంత్రిగా ఎన్నో విజయాలను సాధించాం.

## మీరు డయాబెటిక్ పేషెంట్ అయితే..



పొట్లకాయ మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని భావించే కూరగాయ. డయాబెటిస్‌తో సహా అనేక వ్యాధులలో దీనిని తినడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. పొట్లకాయ తినడం వల్ల జీర్ణక్రియ, కళ్ళకు సంబంధించిన సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. అంతే కాదు రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. పొట్లకాయ రసం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది, కానీ దానిని ఎక్కువగా తాగడం ఆరోగ్యానికి హానికరం. ఆరోగ్యం ప్రకారం, చాలా మంది చేదును తినమని సలహా ఇస్తారు. దీంట్లో అనేక పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఆరోగ్య కోణం నుండి కూడా ప్రయోజనకరమైనవి. రక్తంలో చక్కెర స్థాయిని కూడా తగ్గిస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు పొట్లకాయ తినడం మేలు చేస్తుందని అనేక పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ఒక వ్యక్తికి డయాబెటిస్ స్థాయి తక్కువగా ఉంటే, అతను చేదు రసాన్ని తాగకూడదు. ఎందుకంటే మధుమేహం స్థాయి తగ్గుతుంది అంటే హైపోగ్లైసీమియా పరిస్థితి సరైనది కాదు. పొట్లకాయ శరీరంలో రక్తంలో చక్కెర స్థాయిని తగ్గిస్తుంది. ఎందుకంటే పొట్లకాయలో శరీరంలో ఇన్సులిన్ స్థాయిని తగ్గించే గుణాలు ఉన్నాయి.

## రాత్రి భోజనం తర్వాత నడుస్తున్నారా.....?



పరుగు, నడక మన ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తుందో మనందరికీ తెలుసు. చాలా మంది తమను తాము ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉంచుకోవడానికి రన్ చేస్తారు. రాత్రి డిన్నర్ చేసిన తర్వాత కూడా చాలా మంది బయటికి వాకింగ్ కు వెళ్తారు. కానీ రాత్రి భోజనం చేసిన తర్వాత వాకింగ్ చేయడం ఎందుకు ముఖ్యం..? రాత్రి భోజనం తర్వాత వేగంగా లేదా నెమ్మదిగా నడవాలా..? ఎంతసేపు నడక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది? ఇలాంటి ప్రశ్నలను మీరు ఎప్పుడైనా ఆలోచించారా. రాత్రి భోజనం చేసిన తర్వాత ఎలా నడవాలి..? దాని వల్ల ఎలాంటి ప్రయోజనాలు లభిస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం. రాత్రి భోజనం ఎంత త్వరగా తీసుకుంటే ఆరోగ్యానికి అంత మేలు. రాత్రి 7 నుండి 8 గంటల మధ్య రాత్రి భోజనం చేస్తే వెంటనే నడకకు వెళ్లకండి. రాత్రి భోజనం చేసిన తర్వాత కనీసం 1 గంట నడవండి. రాత్రిపూట పొరపాటున కూడా వేగంగా నడవకూడదు. రాత్రి భోజనం చేసిన తర్వాత ఎప్పుడూ తీరికగా నడవండి. అరగంట నుండి 1 గంట వరకు సాధారణంగా నడవండి. దీని వల్ల మీకు ఎలాంటి హాని జరగదు. ఆహారం తిన్న తర్వాత అరగంట పాటు నడిస్తే ఆహారం తేలికగా జీర్ణమై జీర్ణశక్తి బలంగా ఉంటుంది. అదే సమయంలో ఆహారం తిన్న వెంటనే నిద్రకు ఉపక్రమిస్తే ఆహారం సరిగా జీర్ణం కాక జీర్ణక్రియకు సంబంధించిన సమస్యలు వస్తాయి. రాత్రి భోజనం తర్వాత నడవడం వల్ల జీవక్రియ మెరుగుపడుతుంది. వేగంగా పెరుగుతుంది. దీనితో పాటు, బరువు నియంత్రణలో ఉంటుంది. మీరు రాత్రి భోజనం చేసిన తర్వాత రోజూ వాకింగ్ చేస్తే అది మీ బలహీనమైన రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. సీజనల్ వ్యాధుల నుండి సురక్షితంగా ఉండగలరు. ఆహారం తిన్న తర్వాత వాకింగ్ చేయడం వల్ల గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

ఇలాంటి ప్రశ్నలను మీరు ఎప్పుడైనా ఆలోచించారా. రాత్రి భోజనం చేసిన తర్వాత ఎలా నడవాలి..? దాని వల్ల ఎలాంటి ప్రయోజనాలు లభిస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం. రాత్రి భోజనం ఎంత త్వరగా తీసుకుంటే ఆరోగ్యానికి అంత మేలు. రాత్రి 7 నుండి 8 గంటల మధ్య రాత్రి భోజనం చేస్తే వెంటనే నడకకు వెళ్లకండి. రాత్రి భోజనం చేసిన తర్వాత కనీసం 1 గంట నడవండి. రాత్రిపూట పొరపాటున కూడా వేగంగా నడవకూడదు.

# కరివేపాకును ఇలా తింటే చాలు......



కరివేపాకును దక్షిణ భారత వంటకాల్లో ఎక్కువగా ఉపయోగిస్తారు. వంట రుచిని పెంచడమే కాకుండా, కరివేపాకులో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అనేక ఆరోగ్య సమస్యలకు వ్యతిరేకంగా కరివేపాకు బాగా పనిచేస్తుంది. ఇది కొలెస్ట్రాల్‌ను కరిగించడంలో సహాయపడుతుంది. అలాగే, ఇది జుట్టు సమస్యలను నయం చేస్తుంది. కరివేపాకు వల్ల కలిగే ప్రయోజనాలను ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం. కొలెస్ట్రాల్ నియంత్రణ: రోజూ కరివేపాకు ఆకులను తినడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు పూర్తిగా తగ్గి రక్తనాళాల్లోని కొవ్వు కరిగిపోతుందని నిపుణులు చెబుతున్నారు. కరివేపాకు రసం తీసి తాగవచ్చు. నేటి ఆధునిక ప్రపంచంలో చాలా మందిలో కొలెస్ట్రాల్ సమస్య పెరిగిపోయింది. మార్కెట్లో లభించే మందుల ద్వారా కొలెస్ట్రాల్‌ను నియంత్రించలేము. ఈ సందర్భంలో మీరు కరివేపాకుపై ఆధారపడవచ్చు. కరివేపాకు వేసి నానబెట్టిన నీటిని ఖాళీ కడుపుతో తాగడం వల్ల కొలెస్ట్రాల్ కరిగిపోతుంది. కంటి సమస్యలను దూరం చేస్తుంది: కరివేపాకులో విటమిన్ ఎ పుష్కలంగా ఉంటుంది. కళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ఈ విటమిన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. కరివేపాకులో నానబెట్టిన నీటిని తాగడం వల్ల కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. దృష్టి మెరుగుపడుతుంది. వివిధ రకాల కంటి సమస్యలను నివారిస్తుంది. జుట్టు సమస్యలు దూరం: కరివేపాకు జుట్టుకు చాలా మంచిదని అందరికీ తెలుసు. జుట్టు రాలే సమస్యను తక్షణమే తగ్గిస్తుంది. కరివేపాకును ఉపయోగించడం వల్ల జుట్టుకు పోషణ లభిస్తుంది. కరివేపాకును నీటిలో నానబెట్టి రోజూ తీసుకుంటే జుట్టు రాలడం సమస్య తగ్గుతుంది. మందపాటి మరియు ముదురు జుట్టుకు దోహదం చేస్తుంది. కాలేయ ఆరోగ్యం: ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపడానికి ఆరోగ్యకరమైన కాలేయం చాలా ముఖ్యం. కానీ బయటి ఆహారం, జీవనశైలి మార్పులు మరియు అనేక ఇతర అంశాలు కాలేయాన్ని దెబ్బతీస్తాయి. కాలేయం ఆరోగ్యంగా ఉండాలంటే కరివేపాకును కలుపుకోవాలి. కరివేపాకులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. యాంటీ ఆక్సిడెంట్లు లివర్ డ్యామేజ్‌ని నివారిస్తాయి. ఇంకా, కరివేపాకు కాలేయాన్ని ఆక్సీకరణ ఒత్తిడి నుండి రక్షిస్తుంది. కరివేపాకులో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. మన రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తుంది. ఫలితంగా, శరీరం వివిధ వ్యాధుల నుండి రక్షించబడుతుంది. రోజూ కరివేపాకు నీరు తాగడం వల్ల జీర్ణక్రియ కూడా మెరుగుపడుతుంది. కరివేపాకు తినడం వల్ల గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. కడుపులో మంట నుండి ఉపశమనం పొందవచ్చు. రక్తహీనత సమస్య పూర్తిగా తగ్గుతుంది. అంతేకాకుండా స్త్రీలకు రక్తహీనత సమస్యలు దూరం అవుతాయి. బహిష్టు సమయంలో నొప్పి తగ్గుతుంది. కరివేపాకులోని ఐరన్ కంటెంట్ రక్తాన్ని పెంచుతుంది. మరియు అనేక ఇతర సమస్యలను పరిష్కరిస్తుంది

## జిడ్డు ముక్కుతో బాధపడుతున్నారా..?

జిడ్డు ముక్కు చాలా మందిని వేధిస్తుంటుంది. ఇక మహిళలకు అయితే మరింత ఎక్కువ ఉంటుంది. వాతావరణంతో సంబంధం లేకుండానే కొందరికి ముక్కు జిడ్డుగా అవుతుంది. ముఖం బాగుండి ముక్కు జిడ్డుగా ఉంటే బాగుండదు కదా. మరి దీని కోసం క్రీములు వాడుతున్నారా? వీటివల్ల కొన్ని సైడ్ ఎఫెక్ట్స్ ఉండే అవకాశాలు లేకపోలేదు. అందుకే కొన్ని సూపర్ టిప్స్ పాటించండి. ముక్కుపై జిడ్డు సమస్యకు చెక్ పెట్టడానికి సరైన ఫేస్‌వాష్ ను ఎంపిక చేసుకోవాలి. ముక్కు మీద నూనె ఉంటే ఇది తీసేస్తుంది. మరీ ముఖ్యంగా యాంటీ ఆక్సిడెంట్స్ ఉండే గ్రీన్ టీ ఫేస్ వాష్ ను ఉపయోగించడం వల్ల ఫలితం ఉంటుంది. జిడ్డు ముక్కుతో ఇబ్బందిపడేవారు మాయిశ్చరైజర్‌ను వాడటం మంచిది. జిడ్డు ముక్కుతో ఇబ్బంది పడే వారు జెల్ బేస్డ్ మాయిశ్చరైజర్‌ను ఉపయోగించాలి అంటున్నారు నిపుణులు. ఎండ కారణంగా కూడా ముక్కు జిడ్డుగా మారే సమస్య వస్తుందట. మీకు కూడా ఈ సమస్య ఉంటే సన్‌స్క్రీన్‌ను వాడటం మంచిది. మ్యాట్‌ఫైయింగ్ సన్‌స్క్రీన్‌ను రాసుకుంటే మరింత మంచిది. డీహైడ్రేషన్ కారణంగా కూడా ముక్కు జిడ్డుగా మారుతుంది. కాబట్టి ప్రతీరోజూ కచ్చితంగా తగినంత నీరు తాగాలి.. వర్షంకాలం, చలికాలం అనే సంబంధం లేకుండా నీరు తీసుకోవడం మంచిది. పదేపదే ముఖాన్ని కడుక్కుంటే కూడా ఈ సమస్య వస్తుందట. తరచుగా ముఖం



కడిగితే స్కిన్‌డ్రై సమస్య వస్తుంది. ఆల్కహాల్, కెఫిన్ ఎక్కువగా తీసుకోవడం వల్ల ఈ సమస్య వస్తుంది అంటున్నారు నిపుణులు. అయితే సేబాషియస్ గ్రంథులు ఎక్కువగా నూనెను ఉత్పత్తి చేస్తాయట. ముక్కుపై తేనెను రాసి 10 నుంచి 15 నిమిషాల పాటు మసాజ్ చేసుకోవాలి. తేనెలోని యాంటీ సెప్టిక్, యాంటీ బాక్టీరియల్ గుణాలు ఈ సమస్యకు చెక్ పట్టడంలో చాలా ఉత్తమంగా పని చేస్తాయి. యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉండే గంధం కూడా జిడ్డు ముక్కుకు చెక్ పెడుతుంది. ఇందుకోసం కొంత గంధాన్ని తీసుకొని అందులో పాలు లేదా నీళ్లు కలిపి ముక్కుకు అప్లై చేసుకుంటే సరిపోతుంది. ఆ తర్వాత ముఖాన్ని చల్లటి నీటితో శుభ్రంగా చేసుకోవాలి.

## దోసకాయ తొక్క ప్రయోజనాలు...!



కీరదోస కాయను తీసుకోవడం వల్ల ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయో అందరికీ తెలిసే ఉంటుంది. వేడి కారణంగా చాలా మంది హెల్త్ ప్రాబ్లమ్స్‌ని ఫేస్ చేస్తున్నారు. అదే విధంగా వేసవిలో శరీరానికి తగినంత పోషకాలు అందించాలి. దాని కోసం ఈ సమ్మర్‌లో రోజూ దోసకాయ తినడం మంచిది. ఇందులో పోషకాలు అనేక లాభాలను అందిస్తాయి. ఇందులో చాలా నీరు ఉంటుంది. ఇది శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచుతుంది. మీరు దోసకాయను సలాడ్‌గా తినవచ్చు. దోసకాయలను తిన్న తర్వాత వాటి తొక్కలను పారేస్తుంటారు. దోసకాయ లాగా.. దాని తొక్క కూడా చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. దోసకాయ తొక్కలో అనేక పోషకాలు ఉన్నాయి. వాటిల్లో విటమిన్ కె, విటమిన్ ఎ, విటమిన్ సి లభిస్తాయి. ఈ తొక్కలో యాంటీఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉంటాయి. ఈ కారణంగా.. దోసకాయ తొక్క చర్మం, జుట్టుకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. చర్మాన్ని మృదువుగా, మెరిసేలా చేస్తుంది. దాని నుంచి మీరు స్క్రబ్‌ను కూడా తయారు చేసుకోవచ్చు. దోసకాయ తొక్కలను మిక్సీలో గ్రైండ్ చేసి పేస్ట్ చేయాలి. అందులో కొద్దిగా అలోవెరా జెల్, కొద్దిగా రోజ్ వాటర్ కలపండి. ఇప్పుడు దీన్ని చర్మానికి అప్లై చేసి కాసేపు మసాజ్ చేసి తర్వాత ముఖం కడుక్కోవాలి. ఇది మీకు లోతైన శుభ్రతను ఇస్తుంది. దోసకాయ తొక్కల పేస్ట్‌లో నిమ్మరసం, బేకింగ్ పౌడర్ జోడించి మీ పాదాలను శుభ్రం చేసుకోవచ్చు. ఇది మీ పాదాలను చాలా అందంగా, మృదువుగా చేస్తుంది.

## పరగడుపునే మెంతి నీళ్లు తాగి చూడండి........!



మెంతులను నానబెట్టి ఉదయాన్నే తీసుకుంటే శరీరంలోని అనేక రుగ్మతలకు చెక్ పెడుతుంది. దీనిని ఉదయాన్నే అజీర్ణం, ఉబ్బరం, మలబద్ధకం వంటి జీర్ణ సమస్యలు తగ్గుతాయి. మెంతి నీరు ఆకలిని తగ్గిస్తుంది. జీవక్రియ రేటును పెంచడం, కొవ్వు పేరుకుపోవడాన్ని తగ్గిస్తుంది. కొలెస్ట్రాల్ స్థాయిలు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఎల్ డి ఎల్ చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి మొత్తం గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. మెంతి నీరు రక్తంలో ఇన్సులిన్ నిరోధకతలో ప్రయోజనకరంగా పనిచేస్తుంది. ఖాళీ కడుపుతో మెంతి గింజల నీటిని తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడడం, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడం, తగ్గిన కొలెస్ట్రాల్, బరువు తగ్గడానికి మద్దతు వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. దాని యాంటీఆక్సిడెంట్-రిచ్ కూర్పు రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తుంది. వాపును తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. కరిగే ఫైబర్ పుష్కలంగా ఉంటుంది, మెంతి గింజలు జీర్ణవ్యవస్థ ద్వారా ఆహారం యొక్క కదలికను సులభతరం చేయడం ద్వారా జీర్ణక్రియలో సహాయపడతాయి. మెంతి నీరు తాగడం వల్ల సంపూర్ణత్వం అనుభూతిని అందించడమే కాకుండా, ఎక్కువ కేలరీలు తీసుకోవడం తగ్గించడం ద్వారా బరువు నిర్వహణలో సహాయపడుతుంది. ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచే సామర్థ్యంతో, మెంతులు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. అవసరమైన విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెంట్లతో నిండిన మెంతి గింజలు రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా శరీరం రక్షణను బలోపేతం చేస్తాయి. రుతుక్రమంలో వచ్చే నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఋతు చక్రాన్ని క్రమబద్ధీకరించడానికి, తిమ్మిరి, ఉబ్బరం వంటి లక్షణాల నుండి ఉపశమనం కలిగించే ప్రయోజనకరమైన లక్షణాలను కలిగి ఉంటాయి. అలాగే మెంతులు నానబెట్టి, నూరి తలకు పట్టించుకుంటే జుట్టు ఆరోగ్యానికి మంచిది. మెంతి నీరు రక్తంలో ఇన్సులిన్ నిరోధకతలో ప్రయోజనకరంగా పనిచేస్తుంది. ఖాళీ కడుపుతో మెంతి గింజల నీటిని తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడడం, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడం, తగ్గిన కొలెస్ట్రాల్, బరువు తగ్గడానికి మద్దతు వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది.

## బ్లూ టీ ఆరోగ్య ప్రయోజనాలు.....!



మనలో చాలా మంది మన రోజును టీతో ప్రారంభిస్తారు. కానీ మన ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకుంటూ మనలో చాలా మంది ఉదయాన్నే బ్లాక్ టీ, గ్రీన్ టీ లేదా లెమన్ టీ వంటి కెఫీన్ లేని హెర్బల్ టీని తాగడానికి ఇష్టపడతారు. కానీ బ్లూ టీ కూడా అటువంటి హెర్బల్ టీ అని మీకు తెలుసా..? మీరు మీ ఉదయాన్నే ఇతర టీల స్థానంలో ఈ బ్లూ టీని తాగవచ్చు. బ్లూ టీని క్లిటోరియా టెర్నేటియా అని కూడా అంటారు. ఇది ఆగ్నేయాసియాలో కనిపించే మొక్క. బ్లూ టీ దాని పువ్వుల నుండి తయారు చేస్తారు. ఖాళీ కడుపుతో దీన్ని తాగడం వల్ల రోజంతా ఎనర్జిటిక్ గా అనుభూతి చెందుతారు. ఇందులో ఎన్నో ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ సమయంలో బ్లూ టీ కూడా చాలా ట్రెండ్‌లో ఉంది. బ్లూ పీ టీని ఎలా తయారు చేయాలో తెలుసుకుందాం..? దాని వల్ల కలిగే ప్రయోజనాల గురించి కూడా తెలుసుకుందాం. బ్లూ టీని బటర్‌ఫ్లై పీ టీ అని కూడా పిలుస్తారు. ఇది అనేక ప్రయోజనకరమైన ఆరోగ్య లక్షణాలను కలిగి ఉంది. ఇది అందమైన నీలం పువ్వులతో తయారు చేయబడింది. యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటుంది.



# రంగస్థలం తరహాలో విలేజ్ సెట్

రామ్‌చరణ్ 'గేమ్‌చేంజర్' షూటింగ్‌లో ఓవైపు బిజీగా ఉంటే.. మరోవైపు 'ఉప్పెన'ఫేం బుచ్చిబాబు సాన దర్శకత్వంలో చేయనున్న ఆయన తదుపరి సినిమాకు సంబంధించి ప్రీప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. క్రీడా నేపథ్యంతో కూడిన గ్రామీణ కథతో తెరకెక్కనున్న ఈ పాన్ ఇండియా సినిమాకోసం హైదరాబాద్ నడిబొడ్డున ఒక విలేజ్ సెట్‌ను మేకర్స్ నిర్మిస్తున్నారు. రామ్‌చరణ్ నివాసానికి అతి చేరువలో ఈ భారీ సెట్‌ను నిర్మిస్తుండటం విశేషం. ఈ సినిమా షూటింగ్ 75శాతం ఈ సెట్‌లోనే జరుగనున్నదట. ఈ సెట్ పూర్తికావడానికి కనీసం రెండు నెలలైనా పడుతుందని యూనిట్ సభ్యులు చెబుతున్నారు. గతంలో రామ్‌చరణ్ 'రంగస్థలం' కోసం కూడా ఇలాగే ఓ విలేజ్ సెట్‌ని నిర్మించిన విషయం తెలిసిందే. ఆ సెట్ అప్పట్లో చర్చనీయాంశంగా నిలవడమేకాక, సినిమాకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇప్పుడు బుచ్చిబాబు కూడా గురువు దారిలోనే పయనిస్తున్నట్టు తెలుస్తున్నది. ఇంకా పేరు నిర్ణయించని ఈ సినిమాకోసం రామ్‌చరణ్ తన శరీరాకృతిని మార్చుకునే పనిలో ఉన్నారట. జాన్వీకపూర్ కథానాయికగా నటించనున్న ఈ సినిమాకు ఏ.ఆర్.రెహమాన్ స్వరాలందించనున్న విషయం తెలిసిందే. మైత్రీమూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి వృద్ధి సినిమాస్ ఈ భారీ బడ్జెట్ సినిమాను నిర్మిస్తున్నది.



# మహారాణిలా కనిపించాలి.. అదే నా డ్రీమ్ రోల్

'జయాపజయాల గురించి పెద్దగా ఆలోచించను. మనచేతిలో లేని విషయాల గురించి పట్టించుకోకపోవడమే బెటర్ అనుకుంటా' అని చెప్పింది కృతిశెట్టి. ఆమె శర్వానంద్ సరసన నటిస్తున్న తాజా చిత్రం 'మనమే'. శ్రీరామ్ ఆదిత్య దర్శకుడు. జూన్ 7న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో కృతిశెట్టి మాట్లాడుతూ 'ఈ సినిమాలో నా పాత్ర పేరు సుభద్ర. తను ప్రతి విషయంలో క్రమశిక్షణతో ఉంటుంది. నేను ఇప్పటివరకు చలాకీగా, సున్నితమనస్కురాలైన అమ్మాయి పాత్రల్లోనే ఎక్కువగా నటించాను. కానీ అందుకు భిన్నంగా 'మనమే'లో నా పాత్ర కొత్త కోణంలో సాగుతుంది. ఈ కథలో హార్ట్‌టచింగ్ ఎమోషన్స్ ఉంటాయి. ప్రతి ఒక్కరికి కనెక్ట్ అయ్యే యూనివర్సల్ కాన్సెప్ట్ ఇది. తల్లిదండ్రులు, పిల్లల మధ్య ఉండే అనుబంధం హృద్యంగా అనిపిస్తుంది' అని చెప్పింది. తన డ్రీమ్ రోల్ గురించి మాట్లాడుతూ "బాహుబలి' సినిమాలో అనుష్క తరహాలో ప్రిన్సెస్ పాత్రలు చేయడం చాలా ఇష్టం. అలాగే యాక్షన్, మార్షల్ ఆర్ట్స్ నేపథ్యం ఉన్న రోల్స్ చేయాలని ఉంది' అని తెలిపింది. ప్రస్తుతం తమిళ, మలయాళ భాషల్లో ఒక్కో సినిమా చేస్తున్నానని, ఫెయిల్యూర్స్ గురించి పెద్దగా ఆలోచించకుండా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంపైనే దృష్టిపెట్టానని కృతిశెట్టి పేర్కొంది.




# కలల సాకారం కోసం..

అజయ్‌ఘోష్, చాందిని చౌదరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మ్యూజిక్‌షాప్ మూర్తి'. శివ పాలడుగు దర్శకుడు. హర్ష గారపాటి, రంగారావు గారపాటి నిర్మాతలు. ఈ సినిమా జూన్ 14న విడుదల కానుంది. శుక్రవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. మధ్యతరగతి తాలూకు కష్టాలు, ఆశలు, ఆకాంక్షలను ఆవిష్కరిస్తూ ట్రైలర్ ఆకట్టుకుంది. కలను నెరవేర్చుకోవడానికి వయసుతో సంబంధం లేదనే అంశాన్ని చర్చిస్తూ సందేశాత్మకంగా సాగింది. ఎమోషనల్ డ్రామాగా సాగే ఈ చిత్రం అన్ని వర్గాలను మెప్పిస్తుందని చిత్ర బృందం పేర్కొంది. అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్, బేబీ, డి.జె.టిల్లు చిత్రాలను పంపిణీ చేసిన ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్‌మెంట్ సంస్థ ఈ చిత్రాన్ని విడుదల చేయనుంది. ఈ చిత్రానికి కెమెరా: శ్రీనివాస్ బెజుగం, సంగీతం: పవన్.

# ఈ స్థాయిని ఊహించలేదు

నటి శార్వారీ ప్రస్తుతం అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నది. అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్ మొదలుపెట్టిన ఈ అందాల భామ 'బంటి ఔర్ బబ్లీ 2'తో హీరోయిన్‌గా అరంగేట్రం చేసింది. కేవలం ఒకే ఒక్క సినిమాతో దర్శక, నిర్మాతల దృష్టిని ఆకర్షించింది. ఇప్పుడు బాలీవుడ్‌కి చెందిన అతిపెద్ద ఫ్రాంజైజీల్లో ఈ ముద్దుగుమ్మ భాగం అయ్యింది. ఆదిత్య చోప్రా ఫిల్మ్స్ యూనివర్స్ రూపొందిస్తున్న స్పై యూనివర్స్‌లో శార్వారీ నటించనుంది. అలాగే, దినేష్ విజన్ దర్శకత్వంలో ఈ అందాలభామ నటించిన హారర్ కామెడీ చిత్రం 'ముంజ్యా' ఈనెల 7న విడుదల కానుంది. ఈ సినిమాల గురించి ఆమె మాట్లాడుతూ 'నటిని కావడం నా కల. అయితే.. ఈ స్థాయికి చేరుకుంటానని మాత్రం అనుకోలేదు. నిజానికి నా కష్టం సామాన్యమైనది కాదు. దినేష్ విజన్ హారర్ కామెడీ యూనివర్స్‌తో పాటు, ఆదిత్యచోప్రాగారి యష్ రాజ్ ఫిల్మ్స్ రూపొందిస్తున్న స్పై థ్రిల్లర్‌లో కూడా అవకాశం రావడం నిజంగా నా అదృష్టం. ఒక్క సినిమాతోనే సూపర్‌స్టార్స్‌తో నటించేంత గుర్తింపు రావడం బహుశా చాలా తక్కువ మందికి జరుగుతుందేమో' అంటూ ఆనందం వెలిబుచ్చింది. ఇదిలావుంటే నిఖిల్ అద్వానీ తెరకెక్కించబోతున్న 'వేద' సినిమాలోనూ కథానాయికగా శార్వారీనే ఎంపికచేయడం విశేషం.



# ఇండేన్ గ్యాస్ సిలిండర్లతో ఆర్థిక భరోసా......!





ఇండియన్ ఆయిల్ (ఓఎంసీ) ప్రపంచవ్యాప్తంగా ఎల్‌పీజీకు సంబంధించిన రెండో అతిపెద్ద విక్రయదారుగా ఉంది. ప్రపంచంలోని అతిపెద్ద ప్యాక్డ్ ఎల్‌పీజీ బ్రాండ్‌లలో ఒకటిగా మారింది. బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ కాకుండా పౌరులు కొత్త దేశీయ వంట గ్యాస్ కనెక్షన్‌ల కోసం ఇండియన్ ఆయిల్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ విధానం చాలా సులభంగా ఉంటుంది. 5 కిలోలు, 14.2 కిలోల సిలిండర్లు ఎక్కువగా గృహ వినియోగం కోసం రూపొందించారు. ఈ ధరలు పంపిణీ చేసిన మొత్తం గ్యాస్‌లో దాదాపు సగం ఉంటాయి. ఇండియన్ ఆయిల్ వెబ్‌సైట్ ప్రకారం ఇండేన్ సాధారణంగా 14.2 కేజీల సిలిండర్‌లలో గృహ వినియోగం కోసం అందుబాటులో ఉంది. దేశంలోని కొండ/గ్రామీణ ప్రాంతాల్లోని ఎంపిక చేసిన కొన్ని నగరాల్లో 5 కేజీల కెపాసిటీ సిలిండర్‌లలో కూడా అందుబాటులో ఉంటుంది. కొత్త ఎల్‌పీజీ కనెక్షన్‌లు ఇప్పుడు దేశవ్యాప్తంగా డిమాండ్‌పై అందుబాటులో ఉన్నాయి. డొమెస్టిక్ కనెక్షన్ కోసం మీరు మీ ప్రాంతంలో సేవలందిస్తున్న సమీపంలోని ఇండేన్ డిస్ట్రిబ్యూటర్‌ని సందర్శించి గుర్తింపు, నివాసం యొక్క చెల్లుబాటు అయ్యే రుజువుతో కనెక్షన్ కోసం నమోదు చేసుకోవచ్చు. మీకు కొత్త కనెక్షన్ కోసం రిజిస్ట్రేషన్ చేయించుకున్నప్పుడు డిస్ట్రిబ్యూటర్ రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా మీకు ఇన్టిమేషన్ లెటర్ పంపుతారు. కనెక్షన్‌ని పొందడానికి మీరు లేఖ, కవరును పంపిణీదారు వద్దకు తీసుకెళ్లాలి. ఆ లెటర్ ద్వారా ఇండేన్ కనెక్షన్ మీకు వెంటనే అందిస్తారు. అయితే ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర, అస్సాం, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, మణిపూర్‌లలో 14.2 కిలోల సిలిండర్, 5 కిలోల సిలిండర్‌కు రూ. 2,000, రూ. 1,150 సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలి. ముఖ్యంగా ప్రెజర్ రెగ్యులేటర్‌గా రూ. 200 చెల్లించాల్సి ఉంటుంది. అదే సమయంలో భారతదేశంలోని మిగిలిన ప్రాంతాల్లో, సెక్యూరిటీ డిపాజిట్ మొత్తం 14.2 కిలోల సిలిండర్‌కు రూ. 2,200, 5 కిలోల సిలిండర్‌కు రూ. 1,150 చెల్లించాల్సి ఉంటుంది. ప్రెజర్ రెగ్యులేటర్‌కు రూ. 250 ఉంటుంది. ఆగస్ట్ 30, 2023 నుండి ఇండియన్ ఆయిల్ 14.2 కిలోల సిలిండర్ల ధరలను పెంచలేదు. ఢిల్లీలో, 14.2 కిలోల సిలిండర్ ధర రూ. 903 వద్ద కొనసాగుతోంది, కోల్‌కత్తా లో ధర రూ. 929, ముంబైలో రూ. 902 మరియు రూ. చెన్నైలో 918.50గా ఉంది.

## 500 పాయింట్లు ఎగబాకిన సెన్సెక్స్!





దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఆరంభంలోనే భారీ లాభాల్లో దూసుకెళ్తున్నాయి. ఆసియా మార్కెట్లలోని సానుకూలతలు మన సూచీలకు దన్నుగా నిలుస్తున్నాయి. గతకొన్ని రోజుల వరుస నష్టాల నేపథ్యంలో కనిష్ఠాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపుతున్నారు. ఉదయం 9:27 గంటల సమయంలో సెన్సెక్స్ 525 పాయింట్ల లాభంతో 74,410 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 130 పాయింట్లు లాభపడి 22,619 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.23 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో ఇన్ఫోసిస్, మారుతీ మినహా మిగిలిన షేర్లన్నీ లాభాల్లో ఉన్నాయి. ఎం అండ్ ఎం, ఎల్ అండ్ టీ, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, ఎన్‌టీపీసీ, టాటా మోటార్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, సన్‌ఫార్మా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఐటీసీ, పవర్‌గ్రిడ్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు అత్యధికంగా లాభపడుతున్న జాబితాలో ఉన్నాయి. అమెరికా మార్కెట్లు గురువారం నష్టాలతో ముగిశాయి. టెక్ స్టాక్స్‌లో వచ్చిన అమ్మకాలు అక్కడి సూచీలను ఒత్తిడికి గురిచేశాయి. ఆసియా-పసిఫిక్ మార్కెట్లు నేడు లాభాల్లో ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ బ్రెంట్ చమురు ధర 81.58 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. విదేశీ సంస్థాగత మదుపర్లు గురువారం నికరంగా రూ.3,050 కోట్ల విలువ చేసే షేర్లను అమ్మేశారు. దేశీయ సంస్థాగత మదుపర్లు రూ.3,433 కోట్ల వాటాలను కొనుగోలు చేశారు.

## విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తగ్గాయ్




గత ఆర్థిక సంవత్సరంలో మన దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డీఐ) 3.49% తగ్గి 44.42 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. సేవలు, కంప్యూటర్ హార్డ్‌వేర్-సాఫ్ట్‌వేర్, టెలికాం, వాహన, ఔషధ రంగాలకు తక్కువ పెట్టుబడులు రావడం ఇందుకు నేపథ్యం. 2022-23లో 46.03 బి. డాలర్ల ఎఫ్‌డీఐ తరలి వచ్చింది. 2023-24 జనవరి-మార్చిలో 12.38 బి. డాలర్ల ఎఫ్‌డీఐలు వచ్చాయి. 2022-23 ఇదే కాలంలో వచ్చిన 9.28 బి. డాలర్ల ఎఫ్‌డీఐతో పోలిస్తే, ఇవి 33.4% అధికం.గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో మొత్తం ఎఫ్‌డీఐ (ఈక్విటీలు, రీఇన్వెస్టెడ్ ఎర్నింగ్స్, ఇతర మూలధనం) 1% తగ్గి 70.95 బి. డాలర్లుగా నిలిచాయి. 2022-23లో ఇవి 71.35 బి. డాలర్లుగా ఉన్నట్లు పరిశ్రమ, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహకాల విభాగం (డీపీఐఐటీ) తెలిపింది. 2021-22లో అత్యధికంగా భారత్‌లోకి 84.83 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయి. 2023-24లో మారిషస్, సింగపూర్, అమెరికా, బ్రిటన్, యూఏఈ, జర్మనీ, సైప్రస్ నుంచి ఎఫ్‌డీఐ ఈక్విటీ నిధులు తగ్గాయి. అయితే నెదర్లాండ్స్, జపాన్ నుంచి పెరిగాయి.

## క్రెడిట్ కార్డులపై కొత్త రూల్స్ వచ్చాయ్..!





ఇటీవల కాలంలో క్రెడిట్ కార్డు వాడుతున్న వారి సంఖ్య బాగా పెరిగింది. ప్రతి ఒక్కరూ ఏదో సంస్థకు చెందిన క్రెడిట్ కార్డు ఉండేలా చూసుకుంటున్నారు. దానికి వచ్చే రివార్డు పాయింట్లు, ఆఫర్లు, క్యాష్ బ్యాక్ ల కారణంగా వీటిని విరివిగా వినియోగిస్తున్నారు. అయితే వాటిని వినియోగించే ప్రతి ఒక్కరూ ఆ క్రెడిట్ కార్డులకు సంబంధించిన నిబంధనలను తప్పనిసరిగా తెలుసుకోవాలి. లేకపోతే నష్టపోయే అవకాశం ఉంది. ఇటీవల చాలా బ్యాంకులు తమ క్రెడిట్ కార్డులపై నిబంధనలు మార్చాయి. కొన్ని అంశాలను అప్ గ్రేడ్ చేశాయి. నిర్దిష్ట లావాదేవీలకు సంబంధించిన వడ్డీ రేట్లు, ఆలస్య రుసుముల విషయంలో కొన్ని కొత్త నిబంధనలు తీసుకొచ్చాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎస్ బ్యాంక్, ఐడీఎఫ్సీ ఫస్ట్ బ్యాంకు, హెచ్డీఎఫ్సీ బ్యాంకులకు సంబంధించిన క్రెడిట్ కార్డు వినియోగదారులు తప్పనిసరిగా ఈ నిబంధనలు గురించి తెలుసుకోవాలి. ఈ నాలుగు బ్యాంకుల్లో క్రెడిట్ కార్డులపై సెట్ చేసిన తాజా రుసుములు, మార్గదర్శకాల గురించి పూర్తి వివరాలు మీకు అందిస్తున్నాం.. వచ్చే నెల అంటే జూన్ 21 నుంచి ఈ బ్యాంక్ క్యాష్‌బ్యాక్‌ను నిర్వహించే విధానంలో గణనీయమైన మార్పులు ఉండనున్నాయి. స్విగ్గీ యాప్ లో క్యాష్‌బ్యాక్ స్విగ్గీ మనీగా కనిపించే బదులు, ఈ క్యాష్‌బ్యాక్ ఇప్పుడు నేరుగా క్రెడిట్ కార్డ్ స్టేట్‌మెంట్‌పై ప్రతిబింబిస్తుంది. అంటే క్యాష్‌బ్యాక్ వచ్చే నెలలో మీ స్టేట్‌మెంట్ బ్యాలెన్స్‌ని తగ్గిస్తుంది. జూన్ 20 వరకు, క్యాష్‌బ్యాక్ మీ స్విగ్గీ యాప్‌లో యథావిధిగా చూపుతుంది. ఈ బ్యాంక్ క్రెడిట్ కార్డ్ సేవలను ఉపయోగించే కస్టమర్‌లకు 1 శాతం రుసుముతో పాటు వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) యుటిలిటీ బిల్లు సర్‌చార్జి అదనంగా ఉంటుంది. ఒకే బిల్లింగ్ సైకిల్‌లో రూ.20,000 కంటే ఎక్కువ ఉండే యుటిలిటీ బిల్లులను క్రెడిట్ కార్డ్ లపై చేస్తే ఇది వర్తిస్తుంది. ఫస్ట్ ప్రైవేట్ క్రెడిట్ కార్డ్, ఎల్‌ఐసీ క్లాసిక్ క్రెడిట్ కార్డ్, ఎల్‌ఐసీ సెలెక్ట్ క్రెడిట్ కార్డ్ లు ఈ యుటిలిటీ సర్‌ఛార్జ్ నుంచి మినహాయింపు పొందుతాయి.

## త్వరలోనే మార్కెట్‌లోకి మారుతీ ఈవీ కారు..





భారతదేశంలో ప్రముఖ కార్ల తయారీ కంపెనీ అయిన మారుతీ సుజుకి ఇండియా లిమిటెడ్ ఈవీఎక్స్ పేరుతో భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్లోకి ప్రవేశించనుంచింది. ఈ కాన్సెప్ట్ వెర్షన్ మొదట ఆటో ఎక్స్పో 2023లో ప్రదర్శించారు. అయితే ఈ కార్ల ప్రొడక్షన్ వెర్షన్ మాత్రం 2025 మధ్యలో ప్రారంభిస్తారని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఈవీ కార్లు ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉంది. మారుతీ సుజుకీ ఈవీఎక్స్ కార్లను భారతదేశంలో తయారు చేసి, దేశీయంగా అందుబాటులో ఉంచి, అనంతరం ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేసే అవకాశం ఉంది. ఇటీవల మారుతి ఈవీఎక్స్‌కు సంబంధించి టెస్ట్ మ్యూల్ భారతీయ రోడ్లపై పరీక్షిస్తున్నప్పుడు గుర్తించారు. కాబట్టి మారుతీ సుజుకీ ఈవీఎక్స్‌కు సంబంధించిన విషయాలను తెలుసుకుందాం.వైరల్ అవుతున్న వీడియోలో ఎలక్ట్రిక్ ఎస్‌యూవీను గుర్తించవచ్చు. ఇది కొలతల పరంగా గ్రాండ్ విటారాకు చాలా దగ్గరగా కనిపిస్తుంది. అయితే ఈవీఎక్స్ కొత్త ఆల్-ఎలక్ట్రిక్ ప్లాట్‌ఫారమ్ పై ఆధారపడినందున ఆఫర్లో క్యాబిన్ స్థలం గ్రాండ్ విటారా కంటే మెరుగ్గా ఉంటుందని భావిస్తున్నారు. కొత్త ప్లాట్‌ఫారమ్ ఎలక్ట్రిక్ స్కేట్ బోర్డ్ ప్లాట్ ఫారమ్‌గా ఉంటుంది. ముఖ్యంగా ఈ కారులో ఫ్లోర్బోర్డ్ బ్యాటరీలను కలిగి ఉంటుంది. ఇది క్యాబిన్ లోపల ఉన్నవారి కోసం స్థలాన్ని తెరవడంలో సహాయపడుతుంది.

## జియో సినిమా సరికొత్త చరిత్ర......




ప్రముఖ టెలికం సంస్థ జియోకు చెందిన జియో సరికొత్త చరిత్రను సృష్టించింది. ఐపీఎల్ 2024 సీజన్‌ను జియో లో ఉచితంగా అందించిన విషయం తెలిసిందే. దీంతో ఐపీఎల్ ప్రసారాల్లో సరికొత్త రికార్డులను నెలకొల్పింది జియో. ఈ సీజన్‌లో రికార్డ్ స్థాయి వ్యూస్‌ను సొంతం చేసుకొని సరికొత్త చరిత్రను సృష్టించింది. ఐపీఎల్2024 సీజన్‌లో జియో వేదికగా ఏకంగా 62 కోట్ల మంది క్రికెట్‌ను వీక్షించారు. గతేడాది చూసిన వారితో పోల్సితే ఇది ఏకంగా 53 శాతం అధికం కావడం విశేషం. అంతేకాకుండా ఈ సీజన్‌లో ఏకంగా 35,000 కోట్ల నిమిషాల వాచ్‌టైంను జియో నమోదు చేసింది. ఇది ఓటీటీ వేదికల్లో సరికొత్త రికార్డుగా చెబుతున్నారు. ఇదిలా ఉంటే 2024 ఐపీఎల్ సీజన్ మొదటి రోజున జరిగిన మ్యాచ్‌ను 11.3 కోట్ల మంది వీక్షించారు. గతేడాది మొదటి రోజున వీక్షించిన వారితో పోల్చితే ఇది 51 శాతం అధికం కావడం విశేషం. వీక్షకులు సెషన్‌కు సగటున 75 నిమిషాలు కేటాయించినట్లు జియో తెలిపింది. గతేడాది ఈ సమయం 60 నిమిషాలుగా ఉండేది. ఇదిలా ఉంటే జియో లో వీడియో నాణ్యతను మరింత పెంచడం కూడా వ్యూయర్‌షిప్ పెరగడానికి కారణంగా చెబుతున్నారు. 4కే వీడియో క్వాలిటీ, మల్టీ క్యామ్ ఆప్షన్స్, 12 భాషల్లో ఫీడ్‌తో పాటు అదనంగా ఆర్/వీఆర్ వంటి సదుపాయాలు తీసుకురావడం కూడా ఈ రికార్డు సాధించడానికి కారణంగా చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఐపీఎల్‌తో సరికొత్త రికార్డును సృష్టించిన జియో ఇప్పుడు 2024 పారిస్ ఒలింపిక్స్ జియి లో టెలికాస్ట్ చేయనుంది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ప్రకటన సైతం విడుదల చేసింది. జులై 26వ తేదీ నుంచి జరగనున్న ఒలింపిక్స్‌ను జియో తో పాటు 18 స్పోర్ట్స్‌లో వీక్షించే అవకాశం కల్పించనున్నారు. మొత్తం మీద ఓటీటీ వేదికల్లో జియో తన సత్తా చాటేందుకు సిద్ధమవుతోంది.

## మార్కెట్‌లోకి నయా టాటా కారు...!




టాటా మోటార్స్ ఇండియన్ మార్కెట్లోకి ఆల్టోజ్ రేసర్ విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తోంది. టాటా కార్ల ప్రియులు ఈ కారు రిలీజ్ కోసం చాలా రోజుల నుంచి వెయిట్ చేస్తున్నారు.ఈ కారును ఇటీవలే 2024 భారత్ మొబిలిటీ షోలో ప్రదర్శించారు. టాటా ఆల్ట్రోజ్ రేసర్ అనేది ఇప్పటికే భారతీయ మార్కెట్‌లో విక్రయిస్తున్న టాటా ఆల్ట్రోజ్ వెర్షన్‌కు రేసర్ అనేది స్పోర్టియర్ వెర్షన్‌గా పేర్కొంటున్నారు. ఈ కారు రిలీజ్ అయితే సేల్స్ చార్ట్‌లో బాగా అమ్ముడయ్యే కార్లల్లో ఒకటిగా నిలుస్తుందని నిపుణులు చెబుతున్నారు. టాటా ఆల్ట్రోజ్ కారుకు ఎప్పటి నుంచో అప్‌డేట్‌లు రాలేదు. ఈ నేపథ్యంలో స్పోర్టీ వెర్షన్‌లో నయా ఆల్ట్రోజ్ రేసర్‌ను రిలీజ్ చేసింది. టాటా ఆల్టోజ్ రేసర్ దాని స్పోర్టీ క్యారెక్టర్‌కు అనువగా ఉంటుంది. బోనెట్, కారు పైకప్పుపై రెండు లైన్స్‌తో డ్యూయల్-టోన్ పెయింట్ స్కీమ్‌తో వస్తుంది. అలాగే ఈ కారు రీ డిజైన్ చేసిన గ్రిల్, కొత్త అల్లాయ్ వీల్స్‌తో పాటు ఫెండర్లపై 'రేసర్' బ్యాడ్జితో వస్తుంది. ఈ డిజైన్ గతంలో మోడల్ ప్రారంభ సమయంలో ప్రదర్శించారు. కారు లోపలి భాగం డ్యాష్ బోర్డ్‌లో కాంట్రాస్ట్ స్టిచింగ్, కలర్ యాక్సెంట్లతో కూడిన లెథెరెట్ అప్హోల్స్టరీని కలిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ కారుకు సంబంధించిన స్పోర్టీ ఫీల్‌ను మరింత మెరుగుపర్చేందుకు ఈ అప్‌డేట్స్‌ను ఇచ్చాని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. టాటా ఆల్ట్రోజ్ కారు 10.25-అంగుళాల టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్మెంట్ సిస్టమ్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, 360-డిగ్రీ కెమెరా, హెడ్స్- అప్ డిస్ప్లే, వాయిస్-కమాండ్ సన్‌రూఫ్ వంటి ఫీచర్లతో వస్తుంది. ఈ కారు ఆరు ఎయిర్‌బ్యాగ్లు, ఈఎస్‌సీ స్టాండర్డ్ ఫీచర్లతో వస్తుంది. భవిష్యత్తులో ఈ ఫీచర్లను కారు స్టాండర్డ్ వేరియంట్లలో చేర్చే అవకాశం ఉంది. టాటా ఆల్ట్రోజ్ రేసర్ కారులో 1.2 లీటర్ మూడు-సిలిండర్ పెట్రోల్ ఇంజిన్‌తో వస్తుంది.

# మరోసారి మద్యం బంద్.. ఈనెల 4న డ్రైడే

హైదరాబాద్: హీట్ సమ్మర్ మందు బాబులకు మరింత వేడి పుట్టిస్తోంది. వరుస బందులతో మద్యం ప్రియులకు షాక్ తగులుతోంది. గత రెండు నెలలుగా పలు కారణాలతో మద్యం దుకాణాల మూసివేత కొనసాగుతోంది. ఈనెల 4న మరోసారి మద్యం దుకాణాల మూసివేతకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ప్రభుత్వం డ్రైడేను ప్రకటించింది. ఏప్రిల్ నెల నుంచీ మద్యం దుకాణాల మూసివేతల పర్వం కొనసాగుతోంది. మే నెలలో కూడా కొనసాగింది. ఇప్పుడు జూన్‌లో కూడా మరోసారి మద్యం దుకాణాలు మూసేయబోతున్నారు. ఏప్రిల్ నెలలో రెండు రోజులపాటు మద్యం బందయింది. శ్రీరామ నవమి సందర్భంగా 17వ తేదీన హైదరాబాద్ జంటనగరాల్లో మద్యం షాపులు మూతపడ్డాయి. శ్రీరాముడి శోభాయాత్ర నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. 17న ఉదయం 6 గంటల నుండి 18వ తేదీ మార్నింగ్ 6 వరకు మద్యం షాపులు మూసి ఉంచారు. ఆ తర్వాత అదే నెల 23వ తేదీన హనుమాన్ జయంతి సందర్భంగా మరోసారి మద్యం దుకాణాలు మూసేశారు.



**మే నెలలో నాలుగు రోజులు..**

మే నెలలో ఏకంగా నాలుగు రోజులపాటు మద్యం దుకాణాలు మూతపడ్డాయి. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ కారణంగా.. మే నెలలో 2 రోజులపాటు వైన్ షాపులు, బార్లు, కల్లు దుకాణాలు మూసేశారు. మే 12, 13 తేదీల్లో మద్యం దుకాణాలు మూతపడ్డాయి. ఆ తర్వాత మే 27న నల్గొండ–ఖమ్మం–వరంగల్ జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కారణంగా మూసేశారు. మే 26, 27 తేదీల్లో 48 గంటలపాటు మూసేశారు.

**జూన్ 4న మరోసారి...**

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తుది దశకు చేరుకుంది. శనివారం (జూన్ 1న) చివరి విడత పోలింగ్ ముగిసింది. పోలింగ్ ముగియడంతో.. అందరి దృష్టి కౌంటింగ్ మీద పడింది. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు పూర్తిచేసి, ఫలితాలు ప్రకటించనున్నారు. ఈ నేపథ్యంలో ఆ రోజున మరోసారి మద్యం దుకాణాలు మూసేయనున్నారు. సీఈవో వికాస్‌రాజ్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఫలితాల తర్వాత ఎటువంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకోనున్నట్టు– తెలుస్తోంది.

## లైంగిక దౌర్జన్యం కేసు..

# పరారీలో ప్రజ్వల్ రేవణ్ణ తల్లి



దేశ వ్యాప్తంగా కలకలం రేపిన హాసన అశ్లీల వీడియో, కిడ్నాప్ కేసుల్లో సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసులో హాసన ఎంపీ, ప్రజ్వల్ రేవణ్ణను పోలీస్‌లు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో ప్రజ్వల్ తల్లి భవానీ రేవణ్ణ పైనా ఆరోపణలు వచ్చాయి. దీంతో విచారించేందుకు పోలీస్‌లు ఇంటికి వెళ్లగా ఆమె అందుబాటులో లేదు. ప్రస్తుతం ఆమె పరారీలో ఉన్నట్టు తెలుస్తోంది. రేవణ్ణ ఇంటి పనిమనిషి కిడ్నాప్ ఘటనలో భర్త రేవణ్ణతోపాటు భవానీకి కూడా సంబంధం ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆమెను విచారించేందుకు సిట్ అధికారులు ఆమెకు నోటీసులు పంపారు. శనివారం ఇంటికి వచ్చి ప్రశ్నిస్తామని అందులో పేర్కొన్నారు. నేడు ఆమెను అరెస్ట్ చేసే అవకాశం ఉందని ఊహాగానాలు వినిపించాయి. ఈ నేపథ్యంలోనే శనివారం ఉదయం సిట్ అధికారులు హొళెనరసీపుర లోని ఆమె నివాసానికి వెళ్లగా భవానీ అక్కడ కనిపించలేదు. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వస్తున్నట్టు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ కేసులో ఆమె ముందస్తుబెయిల్ కోసం దరఖాస్తు చేసుకోగా, న్యాయస్థానం దాన్ని తిరస్కరించింది.

# కేరళలో ఉధృతమైన నైరుతి రుతుపవనాలు



తిరువనంతపురం(కేరళ): నైరుతి రుతుపవనాలు గత రెండు రోజులుగా ఉధృతం అయ్యాయి. దక్షిణ, మధ్య జిల్లాల్లో కొండచరియలు విరిగిపడ్డం, చెట్లు విరిగిపడ్డం, అక్కడ నీరు నిలిచిపోయి జలమయం అవ్వడం జరిగింది. కొట్టాయం,ఇడుక్కి జిల్లాల్లో భారీ నష్టం జరిగింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. త్రిస్సూర్, కొజికోడ్ లను శనివారం రెడ్ అలెర్ట్ లుగా ప్రకటించారు. పాలక్కాడ్, వాయ్ నాడ్ లకు యెల్లో అలెర్ట్ ప్రకటించారు. ఒక్కరోజులో 20 సెంటీ మీటర్ల కన్నా ఎక్కువ వాన పడేట్లయితే రెడ్ అలెర్ట్ ప్రకటిస్తారు. 11 నుంచి 20 సెంటీ మీటర్ల మేరకు వాన పడితే ఆరెంజ్ అలెర్ట్ ప్రకటిస్తారు. 6 నుంచి 11 సెంటీ మీటర్ల మేరకు పడితే ఎల్లో అలెర్ట్ ప్రకటిస్తారు. పంటలు, రోడ్లు ధ్వంసమయ్యాయి. తోడుపుళ– పులియన్మల హైరోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. కొట్టాయంలో భారీ వర్షం నమోదయింది.

# కేజ్రీవాల్ కోసం బిజెపి అంబులెన్స్




వైద్య పరీక్షల నిమిత్తం ఢిల్లీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్‌ను ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు బిజెపి సీనియర్ నేత విజయ్ గోయల్ శనివారం ఒక అంబులెన్స్‌ను పంపారు. తాను కొన్ని తీవ్ర రుగ్మతలతో బాధ పడుతుండవచ్చునని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేత తెలిపిన తరువాత విజయ్ గోయల్ ఆ పని చేశారు. అయితే, ఢిల్లీ సివిల్ లైన్స్‌లోని ముఖ్యమంత్రి అధికార నివాసం దారిలోనే అంబులెన్స్‌ను, గోయల్‌ను పోలీసులు అడ్డుకున్నారు. ప్రజల సానుభూతి సంపాదించేందుకు ఆరోగ్య సమస్యల ప్రస్తావన ద్వారా కేజ్రీవాల్ 'నాటకం ఆడుతున్నారు' అని గోయల్ ఆరోపించారు. 'రెండు గంటల లోపే కేజ్రీ పరీక్షలు అన్నీ నిర్వహించేందుకు వీలుగా ఏ ఆసుపత్రికైనా ఆయనను ఈ అంబులెన్స్ తీసుకువెళుతుంది' అని గోయల్ విలేకరులతో చెప్పారు. ముఖ్యమంత్రి 'నాటకం' ఆపాలని, తన ఆరోగ్యం విషయమై నిజంగా ఆందోళన ఉన్నట్లయితే, ఆయన పరీక్షలకు రావాలని మాజీ కేంద్ర మంత్రి విజయ్ గోయల్ సూచించారు.



## పార్టీ నేతలతో సీఎం జగన్

# కీలక సమావేశం

లండన్ పర్యటన నుంచి తిరిగొచ్చిన సీఎం జగన్.. పార్టీ ముఖ్య నేతలతో కీలక సమావేశం ఏర్పాటు చేశారు. తాడేపల్లి నివాసంలో సమావేశం పెట్టారు. సజ్జల రామకృష్ణారెడ్డితో పాటు విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డితో పాటు కీలక నేతలు ఈ సమావేశానికి హాజరుకాబోతున్నారు. గడిచిన 15 రోజులకు సంబంధించి రివ్యూ చేయనున్నారు. అలాగే కౌంటింగ్ కు సంబంధించి ఏ విధంగా సమాయత్తం అవ్వాలి.

# పుణె రోడ్డు ప్రమాదం నిందితుని తల్లి అరెస్టు

**పుణె :** క్రితం నెల తన పోర్ష్ కారుతో ఇద్దరు యువకుల చావుకు కారణమైనట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న 17 ఏళ్ల యువకుని తల్లిని పుణె పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అతని రక్తం నమూనాల స్థానంలో ఆమె నమూనాలు చూపినట్లు నిర్ధారణ అయిన తరువాత తల్లి శివాని అగర్వాల్‌ను అరెస్టు చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ 'పిటిఐ'కి వెల్లడించారు. శివాని అగర్వాల్ శుక్రవారం రాత్రి ముంబయి నుంచి పుణె వచ్చిన తరువాత ఆమె ఆచూకీ తీసినట్లు పోలీసులు తెలిపారు. ఆమెను కోర్టులో హాజరు పరచవలసి ఉంది. తమ దర్యాప్తులో భాగంగా పోలీసులు అబ్జర్వేషన్ హోమ్‌లో దాదాపు ఒక గంట సేపు యువకునితో అతని తల్లి సమక్షంలో మాట్లాడారు. యువకుని ఈ నెల 5 వరకు అబ్జర్వేషన్ హోమ్‌కు రిమాండ్ చేసిన విషయం విదితమే. 'మైనర్ తల్లి సమక్షంలో హోమ్ లోపల అతని విచారణను జరుపుతాం' అని అదనపు పోలీస్ కమిషనర్ (క్రైమ్) శైలేష్ బల్కావాడి చెప్పారు. మైనర్‌తో పోలీసులు మాట్లాడడానికి ముందు ఆయన ఆ విషయం చెప్పారు. టీనేజర్ దర్యాప్తునకు పోలీసులను జువెనైల్ జస్టిస్ బోర్డ్ (జెజెబి) శుక్రవారం అనుమతించింది. జువెనైల్ జస్టిస్ చట్టం ప్రకారం, మైనర్ విచారణను తల్లిదండ్రుల సమక్షంలో నిర్వహించవలసి ఉంటుంది. ఇది ఇలా ఉండగా, టీన్ రక్తం నమూనాల స్థానంలో అతని తల్లి రక్తం నమూనాలు ఉంచారని ప్రమాదంపై దర్యాప్తులో తేలిందని పోలీస్ కమిషనర్ అమితేష్ కుమార్ చెప్పారు.





# సిద్ధు, డికెఎస్‌లకు బెయిల్

బిజెపి ప్రధాన కార్యదర్శి కేశవ్ ప్రసాద్ దాఖలు చేసిన పరువునష్టం కేసు సందర్భంగా ప్రత్యేక ఎంపి/ ఎంఎల్ఎ కోర్టు శనివారం కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్‌లకు బెయిల్ మంజూరు చేసింది. అప్పటి బిజెపి ప్రభుత్వం 40 శాతం కమిషన్ వసూలు చేస్తున్నదనే ఆరోపణతో పూర్తి పేజి అడ్వర్టైజ్‌మెంట్ల ప్రచురణ ద్వారా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రచారం సాగించిందని పిటిషన్ ఆరోపించింది. ఆ బిజెపి ప్రభుత్వాన్ని '40 శాతం ప్రభుత్వం'గా కాంగ్రెస్ ప్రభుత్వం వాటిలో అభివర్ణించింది. అప్పటి బిజెపి ప్రభుత్వం వివిధ ఉద్యోగాకు నిర్ధారించినట్లుగా పేర్కొంటున్న రేట్ కార్డ్‌ను ప్రదర్శిస్తూ పోస్టర్లను,అడ్వర్టైజ్‌మెంట్లను కూడా కాంగ్రెస్ సృష్టించింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విలేకరులతో మాట్లాడుతూ, ఒక ప్రైవేట్ ఫిర్యాదు సందర్భంగా తాను స్వయంగా కోర్టుకు హాజరైనట్లు వెల్లడించారు. 'ఈ కేసు స్వభావం రీత్యా సివిల్‌ది. చట్ట పరిరక్షకునిగా, చట్టాన్ని పాటించే పౌరునిగా న్యాయమూర్తి ముందు స్వయంగా హాజరు కావడం ద్వారా బెయిల్ సంపాదించాను. కెపిసిసి అధ్యక్షుడు శివకుమార్, రాహుల్ గాంధీపై కూడా కేసు దాఖలైంది. రాహుల్ గాంధీ కూడా కోర్టులో హాజరవుతారు' అని సిద్ధరామయ్య తెలిపారు. 'కేసు సందర్భంగా ఇక ముందు హాజరు కానవసరం లేకుండా శాశ్వత ఇంజంక్షన్‌ను కూడా మేము కోరాం' అని సిద్ధరామయ్య చెప్పారు. ఉప ముఖ్యమంత్రి శివకుమార్ కోర్టు ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ, బిజెపి నేతల ప్రకటనలు ప్రాతిపదికగా కాంగ్రెస్ పార్టీ అడ్వర్టైజ్‌మెంట్లు ఇచ్చిందని, దీనిని కోర్టులో సవాల్ చేస్తున్నామని చెప్పారు. సిఎం పదవి కోసం రూ. 2500 కోట్లు ఇచ్చారని బిజెపి నేతలు వెల్లడించారని, ఇతర ప్రతిష్ఠాకర పదవుల కోసం చెల్లించవలసిన మొత్తాలను కూడా ప్రస్తావించారని ఆయన తెలిపారు. 'ఈ తరహా కేసును ఎలా ఎదుర్కోవాలో మాకు తెలుసు. ఏమి చేయాలో, ఎలా చేయాలో మాకు తెలుసు' అని శివకుమార్ చెప్పారు.



# ముందుగానే ఆ రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు

దేశ వ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఈనెల 4న వెలువడనుండగా, దీనికి రెండు రోజులు ముందుగానే జూన్ 2 న అరుణాచల్ ప్రదేశ్ , సిక్కిం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. అరుణాచల్ ప్రదేశ్ లోని 60 అసెంబ్లీ స్థానాలు, సిక్కిం లోని 32 నియోజకవర్గాలకు ఏప్రిల్ 19న పోలింగ్ జరిగింది. కాగా, లోక్‌సభ ఎన్నికలతోపాటు అసెంబ్లీ ఎన్నికలు సైతం జరిగిన ఆంధ్రప్రదేశ్ , ఒడిశా ఫలితాలు యధాప్రకారం జూన్ 4న వెలువడతాయి. అరుణాచల్‌ప్రదేశ్‌లో బీజేపీ, కాంగ్రెస్ ప్రధాన పార్టీలుగా ఉన్నాయి. బీజేపీ మొత్తం 60 సీట్ల లోను పోటీ చేయగా, కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి)లు రాష్ట్రంలో మరో రెండు ప్రధాన పార్టీలుగా ఉన్నాయి. బీజేపీ ఇప్పటికే పోటీ లేకుండా 10 స్థానాల్లో గెలుపొందింది. ఈసారి అరుణాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 82.95 శాతం పోలింగ్ జరిగింది. 2019లో 82.17 శాతం పోలింగ్ జరిగింది. సిక్కింలో ప్రధాన పోటీ అధికార సిక్కిం క్రాంతికారి మోర్చా (ఎస్‌కెఎం), సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎస్‌డిఎఫ్) మధ్య ఉంది. బీజేపీ, కాంగ్రెస్‌లు మరో రెండు ప్రధాన పార్టీలుగా ఉన్నాయి. సిక్కిం అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి 79.88 శాతం పోలింగ్ జరగ్గా, 2019లో 81.43 శాతం పోలింగ్ రికార్డయింది. 2019లో అరుణాచల్ ప్రదేశ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 41 సీట్లు గెలుచుకుని, పెమాఖండూ తిరిగి సిఎం అయ్యారు. కాంగ్రెస్ 4 సీట్లు , జేడీయూ 7, ఎన్‌పీపీ 5 సీట్లు గెలుచుకున్నాయి. సిక్కింలో 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్‌కేఎం 17 సీట్లతో మెజారిటీ సాధించగా ప్రేమ్‌సింగ్ తమంగ్ ముఖ్యమంత్రి అయ్యారు. ఎస్‌డీఎఫ్ 15 సీట్లకు పరిమితమైంది.




# సిఆర్‌పిఎఫ్ డిఐజి ఖజన్ బర్తరఫ్

దేశంలోని అతిపెద్ద పారామిలిటరీ దళం కేంద్ర రిజర్వ్ పోలీస్ దళం (సిఆర్‌పిఎఫ్)కు చెందిన కొందరు మహిళా సిబ్బంది సిఆర్‌పిఎఫ్ డిఐజి ఖజన్ సింగ్ లైంగిక అక్రమ ప్రవర్తనకు పాల్పడినట్లు చేసిన ఆరోపణలపై అతనిని కేంద్ర ప్రభుత్వం బర్తరఫ్ చేసింది. సిఆర్‌పిఎఫ్ డిఐజి, మాజీ క్రీడల అధికారి ఖజన్ సింగ్‌ను 'సర్వీస్ నుంచి బర్తరఫ్ చేస్తూ' రాష్ట్రపతి కార్యాలయం నుంచి ఒక ఉత్తర్వు మే 30న జారీ అయింది. సర్వీస్ నుంచి బర్తరఫ్ మే 31 నుంచి అమలులో ఉంటుందని ఆ ఉత్తర్వు తెలిపింది. ఆఫీసర్‌కు గత కొన్ని నెలల్లో సిఆర్‌పిఎఫ్ రెండు సంజాయిషీ నోటీసులు జారీ చేసిన తరువాత బర్తరఫ్ తుది ఉత్తర్వును కేంద్ర హోమ్ మంత్రిత్వశాఖ, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) ఆమోదించాయి. సిఆర్‌పిఎఫ్ పశ్చిమ రంగం కింద నవీ ముంబయిలో నియుక్తుడైన ఖజన్ సింగ్ లైంగిక వేధింపుల ఆరోపణలను ఖండించారు. అవి 'పూర్తిగా తప్పు' అని, తన 'ప్రతిష్ఠ'ను దెబ్బ తీసేందుకు చేసినవని ఖజన్ అన్నారు. అంతర్గత కమిటీ రూపొందించిన దర్యాప్తు నివేదికను సిఆర్‌పిఎఫ్ ప్రధాన కార్యాలయం ఆమోదించి.




Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com